CELEBRATING 11TH YEAR ANNIVERSARY

ప్రకటన కర్తలకు,పాఠకులకు, తెలుగు ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పెన్‌పవర్ వారి

11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 55 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : నరసరావుపేట శనివారం 1 నవంబర్ 2025 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 55 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : NARASARAO PETA SAT 1 NOVEMBER 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Narasarao Peta,Bapatla,Ongole,Visakhapatnam,Kakinada,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## శత్రువుల ఇంట్లోకి చొరబడి మరీ కొడతాం.. ప్రధాని మోదీ హెచ్చరిక

- సర్దార్ పటేల్ 150వ జయంతి వేడుకల్లో ప్రధాని మోదీ ప్రసంగం
- 'ఆపరేషన్ సిందూర్'తో భారత్ శక్తి ఏంటో ప్రపంచానికి తెలిసిందన్న మోదీ
- గత ప్రభుత్వాలు ఓటు బ్యాంకుల కోసం దేశ భద్రతను విస్మరించాయని విమర్శ
- దేశంలో నక్సలిజాన్ని చాలా వరకు నియంత్రించామని వెల్లడి
- చట్టవిరుద్ధ చొరబాటుదారులందరినీ ఏరివేస్తామని ప్రతిజ్ఞ

పెన్ పవర్ డెస్క్:శత్రువులకు భారత్ ఇచ్చే సమాధానం ఇప్పుడు చాలా స్పష్టంగా, బలంగా, ప్రపంచానికి కనిపించేలా ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం గుజరాత్‌లోని 'స్టాట్యూ ఆఫ్ యూనిటీ' వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. 'ఆపరేషన్ సిందూర్' ద్వారా శత్రు భూభాగంలోకి ప్రవేశించి మరీ దాడులు చేయగలమని భారత్ నిరూపించిందని ఆయన స్పష్టం చేశారు."ఎవరైనా భారత్ వైపు కన్నెత్తి చూసే సాహసం చేస్తే, భారత్ వారి ఇంట్లోకి చొరబడి మరీ దెబ్బకొడుతుందని 'ఆపరేషన్ సిందూర్'తో ప్రపంచమంతా చూసింది. ఈ రోజు పాకిస్థాన్‌కు, ఉగ్రవాద నిర్వాహకులకు భారత్ అసలైన శక్తి ఏంటో బాగా తెలుసు" అని ప్రధాని అన్నారు. దేశ భద్రత విషయంలో తమ ప్రభుత్వ దృఢ వైఖరి, సర్దార్ పటేల్ ఆశయాలకు అనుగుణంగానే ఉందని ఆయన పేర్కొన్నారు.జాతీయ ఐక్యతా దినోత్సవం (రాష్ట్రీయ ఏక్తా దివస్) సందర్భంగా ప్రధాని కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ పార్టీ పటేల్ ఆశయాలను పూర్తిగా మరిచిపోయిందని ఆరోపించారు. కేవలం బాహ్య శత్రువులకే

వివరాలు 2లో..



## కుంచనపల్లి కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ పునఃనిర్మాణానికి మంత్రి లోకేశ్ శంకుస్థాపన

- కుంచనపల్లిలో శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ పునఃనిర్మాణ పనులు ప్రారంభం
- ముఖ్య అతిథిగా హాజరైన ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్
- వేదమంత్రాల నడుమ భూమిపూజ చేసి ప్రత్యేక పూజలు చేసిన మంత్రి
- ఆలయ పునఃనిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరించిన నారా లోకేశ్
- మంత్రికి బాణసంచాతో ఘనంగా స్వాగతం పలికిన గ్రామస్తులు
- కార్యక్రమంలో పాల్గొన్న పలువురు కూటమి నాయకులు, అధికారులు

పెన్ పవర్ డెస్క్:మంగళగిరి నియోజకవర్గం, తాడేపల్లి మండలం కుంచనప ల్లిలో శ్రీ గంగా, శ్రీ అన్నపూ ర్ణాదేవి సమేత శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయ పునఃనిర్మాణ పనులకు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ శుక్రవారం శంకు స్థాపన చేశారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయనకు

వివరాలు 2లో..





'నారా వారి సారా' బయటపెట్టినందుకే కక్ష..

## ఏ టెస్టుకైనా సిద్ధం

- సీఎం చంద్రబాబు, లోకేశ్ పై జోగి రమేశ్ ఫైర్
- నారా వారి సారా వ్యవహారం బయటపెట్టినందుకే కక్ష సాధింపు అని మండిపాటు
- తనను బద్నాం చేసి వైసీపీని దెబ్బతీయాలని కుట్ర చేస్తున్నారని ఆరోపణ

పెన్ పవర్ డెస్క్:ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ పై వైసీపీ నేత జోగి రమేశ్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తాను 'నారా వారి సారా' వ్యవహారాన్ని బయటపెట్టినందుకే తనపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని,

వివరాలు 2లో..

## అమరావతి పనుల్లో జాప్యం వద్దు...
## గడువులోగా పూర్తి చేయాల్సిందే

- అమరావతి నిర్మాణ పనుల పురోగతిపై సీఎం చంద్రబాబు సమీక్ష
- నిర్దేశిత గడువులోగా నిర్మాణాలు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం
- పనుల్లో వేగంతో పాటు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని స్పష్టీకరణ
- రైతులకు రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని సూచన
- రాజధాని సుందరీకరణ, పచ్చదనంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశం
- ప్రతి 15 రోజులకు ఒకసారి పనుల పురోగతిని సమీక్షిస్తానని వెల్లడి



పెన్ పవర్ డెస్క్:రాజధాని అమరావతి నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం జరగకూడదని, నిర్దేశించుకున్న గడువులోగా పనులు పూర్తి చేయాల్సిందేనని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. నిర్మాణాల్లో వేగంతో పాటు నాణ్యత విషయంలో కచ్చితమైన ప్రమాణాలు పాటించాలని సూచించారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో మంత్రి నారాయణ, సీఆర్డీఏ, ఏడీసీఎల్, ఆర్థిక శాఖల ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా రాజధానిలో చేపట్టిన భవన నిర్మాణాల పురోగతి, సుందరీకరణ పనులు, రైతులకు రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ వంటి అంశాలపై సీఎం చర్చించారు. ఏయే నిర్మాణాలు ఎంతవరకు పూర్తయ్యాయి, ఎంతమంది వర్క్ ఫోర్స్ అందుబాటులో ఉన్నారు, నిర్మాణ సంస్థలు అవసరమైన మెషినరీ, మెటీరియల్‌ను సమకూర్చుకున్నాయా అనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనుల పురోగతిని ప్రతి 15 రోజులకు ఒకసారి తానే స్వయంగా సమీక్షిస్తానని చంద్రబాబు వెల్లడించారు. ఇటీవల కురిసిన వర్షాల వల్ల పనుల్లో కొంత జాప్యం జరిగినా, రానున్న రోజుల్లో దానిని భర్తీ చేసేలా వేగం పెంచాలని సూచించారు. కొన్ని నిర్మాణ సంస్థలు ఇంకా పూర్తిస్థాయిలో వర్క్ ఫోర్స్, మెషినరీని కేటాయించలేదని, అలాంటి సంస్థలు తమ పనితీరును వెంటనే మెరుగుపరుచుకోవాలని ఆదేశించారు. భవన నిర్మాణాలకు అవసరమైన గ్రావెల్ సరఫరాలో ఇబ్బందులు

వివరాలు 2లో..

## డీప్‌ఫేక్‌పై ఆందోళన వ్యక్తం చేసిన చిరంజీవి

- డీప్‌ఫేక్ టెక్నాలజీ పెద్ద గొడ్డలిపెట్టు అన్న చిరంజీవి
- తాను కూడా డీప్‌ఫేక్ బాధితుడినేనని వెల్లడి
- ఫిర్యాదు చేయగానే తెలంగాణ పోలీసులు వేగంగా స్పందించారని కితాబు



పెన్ పవర్ డెస్క్: డీప్‌ఫేక్ టెక్నాలజీ సమాజానికి ఒక పెద్ద గొడ్డలిపెట్టుగా మారుతోందని మెగాస్టార్ చిరంజీవి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల తాను కూడా డీప్‌ఫేక్ బారిన పడ్డానని, కొందరు తన ఫొటోలను మార్ఫింగ్ చేసి అశ్లీల వీడియోలు సృష్టించారని ఆయన వెల్లడించారు. ఇలాంటి నేరాలను అరికట్టేందుకు ప్రభుత్వాలు తక్షణమే ప్రత్యేక చట్టాలు

వివరాలు 2లో..

## అమెరికా-భారత్ మధ్య కీలక రక్షణ ఒప్పందం

- ఆసియాన్ రక్షణ మంత్రుల సమావేశం
- పదేళ్ల పాటు ఉండే ఒప్పందంపై సంతకం చేసిన ఇరుదేశాలు
- రాజ్‌నాథ్‌తో భేటీ కావడం సంతోషంగా ఉందన్న అమెరికా రక్షణ మంత్రి



పెన్ పవర్ డెస్క్:అమెరికా, భారత దేశాల మధ్య కీలక రక్షణ ఒప్పందం కుదిరింది. మలేషియాలో ఆసియాన్ రక్షణ మంత్రుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్‌లు సమావేశమయ్యారు. ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక, భద్రత సహకారాన్ని పెంపొందించేందుకు ఉద్దేశించిన ఈ ఒప్పందం పదేళ్ల పాటు కొనసాగనుంది. ఈ సందర్భంగా హెగ్సెత్ సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' ద్వారా స్పందిస్తూ, పదేళ్ల రక్షణ ఒప్పందంపై సంతకం చేయడానికి రాజ్‌నాథ్ సింగ్‌తో సమావేశం కావడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు.

వివరాలు 2లో..

## ఆయుర్వేద దగ్గు మందుతో 5 నెలల చిన్నారి మృతి

- మధ్యప్రదేశ్‌లో కలకలం
- ఆయుర్వేద సిరప్ వాడిన కొద్ది గంటల్లోనే విషమించిన ఆరోగ్యం
- సంబంధిత మెడికల్ షాపును సీల్ చేసిన అధికారులు
- సిరప్ నమూనాలను ల్యాబ్‌కు పంపిన ఆరోగ్య శాఖ
- ఇటీవలే 24 మంది చిన్నారులు మరణించిన ఘటన మరవకముందే ఈ దారుణం
- చిన్నారుల మందుల అమ్మకాలపై మరోసారి భద్రతా ప్రశ్నలు



వివరాలు 2లో..

## ప్రధాని మోదీ తన స్థాయిని మరిచి మాట్లాడుతున్నారు

- తమిళనాడులో బీహారీ కార్మికులను డీఎంకే వేధిస్తోందన్న మోదీ
- ప్రధాని వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించిన సీఎం స్టాలిన్
- రాష్ట్రాల మధ్య విరోధం సృష్టించే చిల్లర రాజకీయాలు మానుకోవాలని హితవు



పెన్ పవర్ డెస్క్:తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వం బీహార్ వలస కార్మికులను వేధిస్తోందంటూ ప్రధాని మోదీ చేసిన ఆరోపణలు రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఈ వ్యాఖ్యలపై తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

వివరాలు 2లో..

## నారా భువనేశ్వరికి రెండు ప్రతిష్ఠాత్మక అవార్డులు...
## నేడు లండన్ వెళుతున్న సీఎం చంద్రబాబు



- అర్థాంగితో కలిసి సీఎం చంద్రబాబు యూకే పర్యటన
- నారా భువనేశ్వరికి రెండు ప్రతిష్ఠాత్మక పురస్కారాలు
- డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్, గోల్డెన్ పీకాక్ అవార్డులు అందుకోనున్న భువనేశ్వరి
- నవంబర్ 4న లండన్‌లో అవార్డుల ప్రదానోత్సవం
- పారిశ్రామికవేత్తలతో సమావేశం కానున్న ముఖ్యమంత్రి
- నవంబర్ 6న తిరిగి రానున్న చంద్రబాబు దంపతులు

వివరాలు 2లో..

## వీధి కుక్కల కేసు: రాష్ట్రాల సీఎస్‌లపై సుప్రీంకోర్టు ఆగ్రహం..

### భౌతికంగా హాజరుకావాల్సిందేనని ఆదేశం



- నవంబర్ 3న భౌతికంగా హాజరు కావాలని కఠిన ఆదేశాలు
- వర్చువల్‌గా హాజరయ్యేందుకు అనుమతించాలన్న విజ్ఞప్తి తిరస్కరణ
- కోర్టు ఆదేశాలను అధికారులు పట్టించుకోవడం లేదన్న ధర్మాసనం
- కంప్లయన్స్ అఫిడవిట్ దాఖలు చేయకపోవడంపై తీవ్ర అసహనం
- పశ్చిమ బెంగాల్, తెలంగాణ సీఎస్‌లకు మాత్రం మినహాయింపు

వివరాలు 2లో..

## ఫలించిన చర్చలు.. ఏపీలో ఎన్టీఆర్ వైద్య సేవలు మళ్లీ ప్రారంభం

- ప్రైవేటు ఆసుపత్రుల్లో ఇటీవల నిలిచిపోయిన ఎన్టీఆర్ వైద్య సేవలు
- కొనసాగించేందుకు అంగీకరించిన యాజమాన్యాలు
- ప్రభుత్వంతో జరిగిన చర్చలు విజయవంతం
- బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చిన సర్కార్
- కొద్దిరోజులుగా తీవ్ర ఇబ్బందులు పడిన రోగులు




పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రోగులకు ఊరటనిచ్చే వార్త. కొద్దిరోజులుగా ప్రైవేటు నెట్ వర్క్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో నిలిచిపోయిన ఎన్టీఆర్ వైద్య సేవలు తిరిగి ప్రారంభమయ్యాయి. పెండింగ్ బకాయిల విడుదల విషయమై ప్రభుత్వానికి, ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలకు మధ్య నెలకొన్న వివాదం పరిష్కారమైంది. ప్రభుత్వంతో జరిగిన చర్చలు సఫలం కావడంతో సేవలను కొనసాగించేందుకు యాజమాన్యాలు అంగీకరించాయి.గత కొంతకాలంగా తమకు రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రైవేటు

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# మన ఎమ్మెల్సీలు ఏం చేస్తున్నారు..
# జగన్ ఆరా.. రీజనిన్ ఇదే...!

ఇప్పటి వరకు లేని విధంగా మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్ తాజాగా ఎమ్మెల్సీల గురించి ఆరా తీసి నట్టు తెలిసింది. "మనోళ్లు ఎక్కడున్నారు? ఏం చేస్తున్నారు?" అని కీలక మాజీ సలహాదారు ను అడిగి తెలుసుకున్నట్టు అత్యంత విశ్వసనీయ వర్గాల నుంచి సమాచారం అందింది. అంతేకాదు.. ప్రస్తుతం ఉన్న ఎమ్మెల్సీల పనితీరును కూడా తెలుసుకున్నట్టు తెలిసింది. వారు ఎక్కడున్నారు? ఏం చేస్తున్నారు ? అనే విషయాలపై కీలక నేత నుంచి సమాచారం తెప్పించుకున్నారని అంటున్నారు.

**ఎందుకు..?**

నిజానికి ఇప్పటి వరకు ఎమ్మెల్యేల గురించి మాత్రమే జగన్ అడపా దడపా ప్రశ్నించేవారు. అంతకు మించి ఎమ్మెల్సీలపై ఆయన ఎప్పుడు దృష్టి పెట్టింది లేదు. వారు ఎక్కడున్నా.. ఏం చేస్తున్నా కూడా.. పెద్దగా స్పందించేవారు కాదు. ఈ క్రమంలోనే పలువురు ఎమ్మెల్సీలు పార్టీకి గుడ్ బై చెప్పారు. కొందరు అధికార పార్టీ టీడీపీలో చేరగా.. మరికొందరు ఇతర పార్టీల్లో చేరారు. అయినప్పటికీ.. జగన్ వారి గురించి ఎక్కడా ప్రస్తావించలేదు. కనీసం వారికి సంబంధించి అంశాలపై ఎప్పుడూ మాట్లాడలేదు. కానీ. తొలిసారి.. ఎమ్మెల్సీల విషయాన్ని జగన్ ప్రస్తావించడం.. ప్రస్తుతం ఉన్న ఎమ్మెల్సీలు ఏం చేస్తున్నారంటూ.. ఆరా తీయడం వంటివి ఆసక్తిగా మారింది. దీనికి ప్రధాన కారణం.. మండలిలో వైసీపీ బలాన్ని తగ్గించే విధంగా రాజకీయ వ్యూహాలు తెరమీదికి వస్తున్నాయని కొన్నాళ్లుగా చర్చ సాగుతోంది. వైసీపీ ప్రస్తుతం మండలిలో పైచేయిగా ఉంది. ప్రభుత్వానికి ఇక్కడే ఇబ్బంది వస్తున్న విషయం తెలిసిందే. టీడీపీ నేత చంద్రయ్య కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చే బిల్లుకు కూడా ఇక్కడే అడ్డుకట్ట పడింది. అలానే.. ఇతర అంశాలపై కూడా వైసీపీ ఇక్కడే పోరాటం చేస్తోంది. దీంతో భవిష్యత్తులో తీసుకువచ్చే పలు బిల్లులకు వైసీపీ అడ్డు కట్ట వేయకుండా.. మండలిలో పైచేయి సాధించాలన్నది టీడీపీ వ్యూహం. రాజకీయంగా ఇలాంటివి కామనే. అయితే.. ప్రస్తుతం అసెంబ్లీలో ఎలానూ బలం లేనందున.. మండలిలో కూడా బలం పోతే.. ఇక, వైసీపీకి గుర్తింపు పెద్దగా ఉండదు. ఈ నేపథ్యంలోనే.. జగన్.. తమ ఎమ్మెల్సీల విషయాన్ని ఆరా తీశారని.. తాడేపల్లి వర్గాలు చెబుతున్నాయి. అయితే.. పార్టీ నుంచి బయటకు వచ్చే వారిని ఆపని సంస్కృతి కొనసాగుతున్న వైసీపీలో ఇప్పుడు ఇలా చర్చించడం.. ఆరా తీయడం ఆసక్తిగా మారింది.

# ఆయుర్వేద దగ్గు మందుతో 5 నెలల చిన్నారి మృతి

మధ్యప్రదేశ్‌లో దగ్గు మందుల మరణాల పరంపర కొనసాగుతూనే ఉంది. ఇటీవల నకిలీ సిరప్‌లతో 24 మంది చిన్నారులు మరణించిన ఘటన మరవకముందే, ఇప్పుడు ఓ ఆయుర్వేద దగ్గు మందు 5 నెలల శిశువు ప్రాణాలను బలిగొంది. చింధ్వాడా జిల్లాలో జరిగిన ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. అధికారులు వెంటనే స్పందించి, మందు అమ్మిన దుకాణాన్ని మూసివేశారు.

**అసలేం జరిగింది?**

చింధ్వాడా జిల్లా బిచ్వా గ్రామానికి చెందిన సందీప్ మినోట్ కుమార్తె 5 నెలల రూహీకి దగ్గు, జలుబు చేసింది. దీంతో వారు అక్టోబర్ 27న స్థానికంగా ఉన్న ఆక్సిజన్ మెడికల్ స్టోర్‌లో ఓ ఆయుర్వేద దగ్గు సిరప్‌ను కొనుగోలు చేశారు. దుకాణదారుడి సలహా మేరకు పాపకు ఆ మందు పట్టించారు. అయితే, కొద్ది గంటల్లోనే చిన్నారి ఆరోగ్యం విషమించింది. "పాపకు శ్వాస ఆడలేదు, వెంటనే ఊపిరి ఆగిపోయింది" అని తండ్రి సందీప్ కన్నీటిపర్యంతమయ్యారు.వెంటనే పాపను స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించగా, తెల్లవారుజామున 4:30 గంటలకు శిశువు అప్పటికే మరణించిందని వైద్యులు ధృవీకరించారు.

**అధికారుల చర్యలు**

ఈ ఘటనపై సమాచారం అందుకున్న ఆరోగ్య శాఖ అధికారులు వెంటనే రంగంలోకి దిగారు. సిరప్ అమ్మిన మెడికల్ స్టోర్‌ను సీల్ చేసి, మిగిలిన స్టాక్‌ను స్వాధీనం చేసుకున్నారు. సిరప్ నమూనాలను పరీక్షల నిమిత్తం ప్రభుత్వ ల్యాబొరేటరీకి పంపించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బిచ్వా పోలీసులు కేసు నమోదు చేశారు. "జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి నేతృత్వంలో దర్యాప్తు జరుగుతోంది. పోస్ట్‌మార్టం నివేదిక వచ్చాకే మరణానికి కచ్చితమైన కారణం తెలుస్తుంది" అని జిల్లా కలెక్టర్ హరేంద్ర నారాయణ్ తెలిపారు.ఏడాది లోపు పిల్లలకు వైద్యుని సిఫార్సు లేకుండా దగ్గు మందులు అమ్మకూడదన్న నిబంధనలను ఉల్లంఘించినట్లు ప్రాథమికంగా గుర్తించారు. డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టం కింద ఈ కేసును విచారిస్తున్నారు.

**వీడని విషాదాలు**

కొన్ని వారాల క్రితమే బేతూల్, చింధ్వాడా జిల్లాల్లో 'కొల్డ్రిఫ్' అనే నకిలీ దగ్గు మందు కారణంగా 24 మంది చిన్నారులు మరణించారు. ఇప్పుడు ఆయుర్వేద సిరప్ సైతం అనుమానాల నీడలోకి రావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. మధ్యప్రదేశ్‌లో వరుసగా చోటుచేసుకుంటున్న ఈ ఘటనలు దేశంలో ఔషధాల నాణ్యత, నియంత్రణ వ్యవస్థలపై తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి.

# 'నారా వారి సారా' బయటపెట్టినందుకే కక్ష.. ఏ టెస్టుకైనా సిద్ధం

- మొదటి పేజి తరువాయి

తనను ఓ కేసులో ఇరికించి పార్టీని దెబ్బతీయాలని చూస్తున్నారని సంచలన ఆరోపణలు చేశారు.

జోగి రమేశ్ మాట్లాడుతూ, "రాష్ట్రంలో నారా వారి సారా దందాను ఇబ్రహీంపట్నం కేంద్రానికి వెళ్లి మరీ ప్రజల ముందు ఉంచాను. అప్పటి నుంచే నాపై కుట్రలు మొదలుపెట్టారు. ఈ అంశాన్ని రాజకీయంగా పక్కదారి పట్టించేందుకే నన్ను లక్ష్యంగా చేసుకున్నారు. చంద్రబాబు, లోకేశ్ నన్ను బద్నాం చేసి, వైసీపీని డ్యామేజ్ చేయాలని దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారు" అని విమర్శించారు.

ఈ క్రమంలో తాను ఏ విచారణకైనా సిద్ధమని ఆయన స్పష్టం చేశారు. "లై డిటెక్టర్ టెస్టుకు, సీబీఐ విచారణకు, చివరికి నార్కో టెస్టుకైనా నేను సిద్ధం. తిరుమల వెంకన్న సన్నిధిలో ప్రమాణం చేస్తానని చెప్పాను. విజయవాడ దుర్గమ్మ వద్ద నా కుటుంబంతో సహా ప్రమాణం చేశాను. అయినా ఎవరూ స్పందించడం లేదు" అని జోగి రమేశ్ తెలిపారు. చంద్రబాబు తన హృదయాన్ని, వ్యక్తిత్వాన్ని గాయపరిచారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.కేసు రిమాండ్ రిపోర్ట్‌లో తన పేరు లేనప్పటికీ, ఫేక్ వాట్సాప్ చాట్‌లు, వీడియోలను సృష్టించి తనపై బురద జల్లుతున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై డీజీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేశానని తెలిపారు.

తనకు జనార్దన్ అనే వ్యక్తితో ఎలాంటి సంబంధం లేదని తేల్చిచెప్పారు. "ఏ తప్పు చేయని జోగి రమేశ్ మీకు దొరికాడా? చంద్రబాబు, లోకేశ్ ఎల్లకాలం అధికారంలో ఉండరు. ఏదో ఒకరోజు చట్టం ముందు సమాధానం చెప్పాల్సి వస్తుంది" అని హెచ్చరించారు. ఈ కేసులో సిట్ అధికారులు ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిజాయతీగా విచారణ జరపాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# వీధి కుక్కల కేసు: రాష్ట్రాల సీఎస్‌లపై సుప్రీంకోర్టు ఆగ్రహం..

వీధి కుక్కల నియంత్రణ కేసులో పలు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శుల (సీఎస్‌లు) తీరుపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు ఆదేశాలను పాటించని సీఎస్‌లు నవంబర్ 3న జరిగే విచారణకు భౌతికంగా హాజరు కావాల్సిందేనని స్పష్టం చేసింది. వర్చువల్‌గా హాజరయ్యేందుకు అనుమతించాలన్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా విజ్ఞప్తిని ధర్మాసనం తోసిపుచ్చింది. ఈ కేసుకు సంబంధించి సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా శుక్రవారం జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం ముందు ప్రస్తావించారు. సదరు సీఎస్‌లను వర్చువల్‌గా హాజరయ్యేందుకు అనుమతించాలని కోరారు. దీనిపై ధర్మాసనం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. "కంప్లయన్స్ అఫిడవిట్ దాఖలు చేయమని మేము ఆదేశిస్తే, వాళ్లు నిద్రపోతున్నారు. కోర్టు ఆదేశాల పట్ల ఏమాత్రం గౌరవం లేదు. సరే, అయితే వాళ్లనే రానివ్వండి" అని జస్టిస్ విక్రమ్ నాథ్ ఘాటుగా వ్యాఖ్యానించారు.వీధి కుక్కల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై ఆగస్టు 22న ఇచ్చిన ఆదేశాల మేరకు కంప్లయన్స్ అఫిడవిట్లు దాఖలు చేయనందున, పశ్చిమ బెంగాల్, తెలంగాణ మినహా అన్ని రాష్ట్రాల సీఎస్‌లు నవంబర్ 3న తమ ముందు హాజరు కావాలని సుప్రీంకోర్టు అక్టోబర్ 27న ఆదేశించిన విషయం తెలిసిందే.

ఆగస్టు 22న సుప్రీంకోర్టు ఈ కేసు పరిధిని ఢిల్లీ-ఎన్‌సీఆర్ నుంచి దేశవ్యాప్తంగా విస్తరించింది. జంతు జనన నియంత్రణ (ఏబీసీ) నిబంధనల అమలుకు అవసరమైన వనరుల (డాగ్ పౌండ్స్, పశు వైద్యులు, కుక్కలను పట్టే సిబ్బంది, వాహనాలు, బోనులు) పూర్తి గణాంకాలతో అఫిడవిట్లు దాఖలు చేయాలని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల

మున్సిపల్ అధికారులను ఆదేశించింది. ఏబీసీ నిబంధనలు దేశమంతటా ఒకేలా వర్తిస్తాయని పేర్కొంటూ రాష్ట్రాలను ఈ కేసులో ప్రతివాదులుగా చేర్చింది. ఢిల్లీలో వీధి కుక్కల కాటు వల్ల చిన్నారులు రేబిస్ బారిన పడుతున్నారంటూ వచ్చిన మీడియా కథనాల ఆధారంగా సుప్రీంకోర్టు జూలై 28న ఈ కేసును సుమోటోగా స్వీకరించి విచారణ జరుపుతోంది.

# నారా భువనేశ్వరికి రెండు ప్రతిష్ఠాత్మక అవార్డులు... నేడు లండన్ వెళుతున్న సీఎం చంద్రబాబు

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యక్తిగత పర్యటన నిమిత్తం యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) వెళ్లనున్నారు. తన అర్ధాంగి, హెరిటేజ్ ఫుడ్స్ ఎండీ నారా భువనేశ్వరితో కలిసి ఆయన శనివారం రాత్రి హైదరాబాద్ నుంచి లండన్‌కు బయల్దేరనున్నారు. ఈ పర్యటనలో భాగంగా లండన్‌లో జరిగే కార్యక్రమంలో నారా భువనేశ్వరి రెండు ప్రతిష్ఠాత్మక అవార్డులను అందుకోనున్నారు.నవంబర్ 4న లండన్‌లో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ (%×ూణ%) సంస్థ ఓ కార్యక్రమాన్ని నిర్వహించనుంది. ఈ వేదికపై నారా భువనేశ్వరి రెండు కీలక పురస్కారాలను స్వీకరించనున్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా ప్రజాసేవ, సామాజిక సాధికారతకు చేస్తున్న కృషికి గుర్తింపుగా ఆమెను 'డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్-2025' అవార్డుకు ఎంపిక చేశారు. అలాగే, 'ఎక్సలెన్స్ ఇన్ కార్పొరేట్ గవర్నెన్స్' విభాగంలో హెరిటేజ్ ఫుడ్స్ సంస్థకు లభించిన 'గోల్డెన్ పీకాక్' అవార్డును కూడా ఎండీ హోదాలో ఆమె అందుకోనున్నారు.గతంలో ఈ డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్ అవార్డును భారత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం, పారిశ్రామికవేత్తలు గోపీచంద్ హిందూజా, రాజశ్రీ బిర్లా, దిలీప్ సంఘ్వీ, దుబాయ్ ఎలక్ట్రిసిటీ, వాటర్ అథారిటీ ఎండీ సయీద్ మహ్మద్, హీరో ఎంటర్ ప్రైజెస్, గోయెంకా గ్రూప్ సంస్థల ఛైర్మన్ సంజీవ్ గోయెంకా వంటి దిగ్గజ వ్యక్తులు వంటి ప్రముఖులు అందుకున్నారు. ఇప్పుడు ఆ గౌరవం భువనేశ్వరికి దక్కడం విశేషం.ఈ పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు పలువురు పారిశ్రామికవేత్తలు, ప్రవాసాంధ్రులతో కూడా సమావేశం కానున్నారు. నవంబర్ 14, 15 తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సుకు వారిని ఆహ్వానించనున్నారు. తమ పర్యటనను ముగించుకుని చంద్రబాబు దంపతులు నవంబర్ 6న తిరిగి రాష్ట్రానికి రానున్నారు.

# డీప్‌ఫేక్‌పై ఆందోళన వ్యక్తం చేసిన చిరంజీవి

- మొదటి పేజి తరువాయి

తీసుకురావాలని, లేకపోతే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు.సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతి సందర్భంగా తెలంగాణ పోలీసులు ఈరోజు హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులో 'రన్ ఫర్ యూనిటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చిరంజీవి.. డీజీపీ శివధర్ రెడ్డి, హైదరాబాద్ సీపీ సజ్జనర్‌తో కలిసి 2కే రన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ, డీప్‌ఫేక్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు."డీప్‌ఫేక్ అనేది చాలా ప్రమాదకరమైనది. నా ఫొటోలను మార్ఫింగ్ చేసిన విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు వెంటనే స్పందించి చర్యలు తీసుకున్నారు. డీజీపీ శివధర్ రెడ్డి, సీపీ సజ్జనార్ ఈ విషయాన్ని చాలా సీరియస్‌గా తీసుకున్నారు. ఈ కేసును సీపీ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. తెలంగాణ పోలీసు వ్యవస్థ చాలా బలంగా ఉంది. ప్రజలకు వారు అండగా నిలుస్తున్నారు" అని చిరంజీవి తెలిపారు.

పెరుగుతున్న టెక్నాలజీని ఆహ్వానించాలని, అయితే దానితో పాటు వచ్చే ముప్పుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. "డీప్‌ఫేక్, సైబర్ నేరాలకు ఎవరూ భయపడాల్సిన పనిలేదు. ధైర్యంగా పోలీసులను ఆశ్రయించండి. ప్రభుత్వాలు ఈ సమస్యపై దృష్టి సారించి కఠినమైన చట్టాలు రూపొందించాలి" అని ఆయన విజ్ఞప్తి చేశారు. అంతకుముందు

మాట్లాడుతూ, 560 సంస్థానాలను ఏకం చేసి దేశానికి 'వన్ నేషన్' అనే గొప్ప వరాన్ని అందించిన మహనీయుడు సర్దార్ పటేల్ అని చిరంజీవి కొనియాడారు. ఆయన దృఢ సంకల్పం, దార్శనికత అందరికీ ఆదర్శనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం కల్పించినందుకు పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు.

# ప్రధాని మోదీ తన స్థాయిని మరిచి మాట్లాడుతున్నారు

- మొదటి పేజి తరువాయి

ప్రధాని తన స్థాయిని మరిచి మాట్లాడుతున్నారంటూ ఘాటుగా బదులిచ్చారు.

బీహార్‌లో జరిగిన ఓ ఎన్నికల ప్రచార సభలో ప్రధాని మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. తమిళనాడులో పనిచేస్తున్న బీహారీ కార్మికులను డీఎంకే ప్రభుత్వం అవమానిస్తోందని, వారిపై వేధింపులకు పాల్పడుతోందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో, ప్రధాని వ్యాఖ్యలను ఖండిస్తూ సీఎం స్టాలిన్ 'ఎక్స్' వేదికగా ఓ ప్రకటన విడుదల చేశారు."ఒక తమిళుడిగా ప్రధాని మోదీని నేను వినయంగా కోరుతున్నాను. ఆయన దేశ ప్రజలందరికీ ప్రధాని అనే గౌరవప్రదమైన స్థానంలో ఉన్నారనే విషయాన్ని తరచుగా మర్చిపోతున్నారేమో అని బాధగా ఉంది. ఇలాంటి ప్రకటనలతో తన పదవికి ఉన్న గౌరవాన్ని కోల్పోవద్దు" అని స్టాలిన్ పేర్కొన్నారు. బీజేపీ సభ్యులు కేవలం ఎన్నికల రాజకీయాల కోసం ఒడిశా, బీహార్ అంటూ తమిళులపై తమ ద్వేషాన్ని ప్రదర్శిస్తున్నారని, ఒక ముఖ్యమంత్రిగా ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.

హిందువులు, ముస్లింల మధ్య శత్రుత్వం పెంచినట్లే, ఇప్పుడు తమిళులు, బీహార్ ప్రజల మధ్య విరోధం సృష్టించేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని స్టాలిన్ విమర్శించారు. "ఇటువంటి చిల్లర రాజకీయ పద్ధతులు మానుకుని, దయచేసి దేశ సంక్షేమంపై దృష్టి పెట్టండి" అని ప్రధానికి, బీజేపీ నేతలకు ఆయన హితవు పలికారు. ప్రధాని వ్యాఖ్యలతో దక్షిణాది రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి

# అమెరికా-భారత్ మధ్య కీలక రక్షణ ఒప్పందం

- మొదటి పేజి తరువాయి

ఇది ఇరు దేశాల రక్షణ భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకువెళుతుందని ఆయన అన్నారు. సమన్వయం, సమాచారంతో పాటు సహకారాన్ని మరింతగా పెంచుకుంటామని, తమ రక్షణ సంబంధాలు మరింత బలంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.

# అమరావతి పనుల్లో జాప్యం వద్దు... గడువులోగా పూర్తి చేయాల్సిందే

- మొదటి పేజి తరువాయి

తలెత్తకుండా గనుల శాఖతో సమన్వయం చేసుకోవాలని అధికారులకు సూచించారు.

**రైతులకు ఇబ్బందులు రానీయొద్దు**

రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతులకు కేటాయించిన రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. ఈ విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని మంత్రి నారాయణ, అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఇంకా 2,471 మంది రైతులకు ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉందని, కొన్ని సాంకేతిక, రైతుల వ్యక్తిగత కారణాల వల్ల ఇవి పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు సీఎంకు వివరించారు. త్వరలోనే తాను రాజధాని రైతులతో సమావేశమవుతానని చంద్రబాబు తెలిపారు. నిర్మాణాలతో పాటు రాజధానిలో పచ్చదనం, సుందరీకరణ, పరిశుభ్రతకు కూడా అంతే ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం స్పష్టం చేశారు. అమరావతికి 'వరల్డ్ క్లాస్ సిటీ' లుక్ రావాలంటే ఆకాశహర్మ్యాలు (హైరైజ్ బిల్డింగులు) అవసరమని అభిప్రాయపడ్డారు. ప్రైవేట్ సంస్థలు చేపట్టే నిర్మాణాలు కూడా ఐకానిక్ మోడల్‌లో ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో వివిధ కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులు కూడా పాల్గొన్నారు.

# శత్రువుల ఇంట్లోకి చొరబడి మరీ కొడతాం.. ప్రధాని మోదీ హెచ్చరిక

- మొదటి పేజి తరువాయి

కాకుండా నక్సలిజం, చొరబాట్లు వంటి అంతర్గత సవాళ్లను ఎదుర్కోవడంలో కూడా తమ ప్రభుత్వానికి పటేల్ ఆదర్శాలే మార్గనిర్దేశం చేస్తున్నాయని తెలిపారు."2014కు ముందు దేశంలోని అనేక ప్రాంతాల్లో నక్సలైట్లు సమాంతర పాలన సాగించారు. పాఠశాలలు, ఆసుపత్రులను పేల్చివేస్తుంటే, నాటి ప్రభుత్వాలు నిస్సహాయంగా చూశాయి. మేము అర్బన్ నక్సల్స్‌పై కఠినంగా వ్యవహరించాం. దాని ఫలితాలు ఇప్పుడు కనిపిస్తున్నాయి. గతంలో 125 జిల్లాల్లో ఉన్న నక్సల్స్ ప్రభావం ఇప్పుడు కేవలం 11 జిల్లాలకే పరిమితమైంది" అని మోదీ వివరించారు.

చొరబాట్లు దేశ ఐక్యతకు పెను ముప్పుగా పరిణమించాయని ప్రధాని హెచ్చరించారు. "గత ప్రభుత్వాలు ఓటు బ్యాంకుల కోసం దేశ భద్రతను పణంగా పెట్టాయి. దేశం బలహీనపడినా చొరబాటుదారుల కోసం పోరాడేవారు పట్టించుకోరు. కానీ దేశ భద్రత, గుర్తింపు ప్రమాదంలో పడితే ప్రతి పౌరుడూ ప్రమాదంలో పడినట్లే. అందుకే, చట్టవిరుద్ధంగా నివసిస్తున్న ప్రతి చొరబాటుదారుడిని దేశం నుంచి తొలగించాలని మనం సంకల్పించుకోవాలి" అని ఆయన పిలుపునిచ్చారు.భిన్నత్వంలో ఏకత్వం అనే పటేల్ సందేశాన్ని గుర్తుచేస్తూ ప్రధాని తన ప్రసంగాన్ని ముగించారు. "ఐక్య భారతదేశంలో విభిన్న ఆలోచనలను గౌరవించాలి. అభిప్రాయ భేదాలు ఉండొచ్చు, కానీ హృదయాల్లో భేదాలు ఉండకూడదు" అని ఆయన అన్నారు. అంతకుముందు, ప్రధాని మోదీ 182 మీటర్ల ఎత్తైన పటేల్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి, హాజరైన వారితో ఏక్తా దివస్ ప్రతిజ్ఞ చేయించారు. 2014 నుంచి ప్రతి ఏటా అక్టోబర్ 31న సర్దార్ పటేల్ జయంతిని జాతీయ ఐక్యతా దినోత్సవంగా జరుపుకుంటున్న విషయం తెలిసిందే.

# ఫలించిన చర్చలు.. ఏపీలో ఎన్టీఆర్ వైద్య సేవలు మళ్లీ ప్రారంభం

- మొదటి పేజి తరువాయి

నెట్ వర్క్ స్పెషాలిటీ ఆసుపత్రులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి. ఈ విషయంలో ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రాకపోవడంతో ఎన్టీఆర్ వైద్య సేవలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించాయి. దీంతో రాష్ట్రవ్యాప్తంగా పేద, మధ్యతరగతి రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సకాలంలో వైద్యం అందక అనేకమంది అవస్థలు పడ్డారు.ఈ నేపథ్యంలో రంగంలోకి దిగిన ప్రభుత్వం, ఆసుపత్రుల యాజమాన్యాలతో చర్చలు జరిపింది. యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలను, డిమాండ్లను సానుకూలంగా పరిష్కరిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చింది. ప్రభుత్వ హామీతో సంతృప్తి చెందిన ప్రైవేటు ఆసుపత్రులు, ఎన్టీఆర్ వైద్య సేవలను పునరుద్ధరించడానికి అంగీకరించాయి. దీంతో రోగులు యథావిధిగా ఈ సేవలను వినియోగించుకునేందుకు మార్గం సుగమమైంది.

# కుంచనపల్లి కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ పునఃనిర్మాణానికి మంత్రి లోకేశ్ శంకుస్థాపన

- మొదటి పేజి తరువాయి

గ్రామ స్థులు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు బాణసంచా మోతలు, పూలమాలలతో ఘనంగా స్వాగతం పలికారు.అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య మంత్రి లోకేశ్ ఆలయ పునఃనిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులతో కలిసి శంకుస్థాపన చేసిన ఆయన, ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఆ తర్వాత ధాన్యాదివాసంలో ఉన్న స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, గ్రామస్తులతో కలిసి ఫోటోలు దిగారు.ఈ శంకుస్థాపన మహోత్సవంలో పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, గుంటూరు పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావుతో పాటు పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పెన్ పవర్
గుంటూరు । బాపట్ల । పల్నాడు

## రిపోర్టర్ వెంగళరెడ్డి తనయుల నూతన వస్త్రాల వేడుకలో చిన్నారులను ఆశీర్వదించిన ఆదర్శ మల్టీ మీడియా అసోసియేషన్ సభ్యులు

**పెన్ పవర్, అక్టోబర్ 31, సంతమాగులూరు:**

మండలంలోని ఏల్చూరుకు చెందిన రిపోర్టర్ బలుసునూరి వెంగళరెడ్డి కుమారులకు నూతన వస్త్రాల బహూకరణ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు సంతమాగులూరు మండలం ఆదర్శ మల్టీమీడియా అసోసియేషన్ (అమ్మ) సభ్యులు హాజరయ్యారు. ఈసందర్భంగా చిన్నారులను ఆశీర్వదించి, ఆశీస్సులు అందజేశారు. అనంతరం వెంగళరెడ్డి దంపతులు ఏర్పాటు చేసిన ఆతిథ్యం స్వీకరించారు. ఈకార్యక్రమంలో సంతమాగులూరు మండలం ఆదర్శ మల్టీ మీడియా అసోసియేషన్ ( అమ్మ )అధ్యక్షుడు అంగలకుదిటి కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు పిల్లలమర్రి అశోక్ కుమార్, కార్యదర్శి షేక్.నాగూర్ వలి,



ట్రెజరర్ సన్నెగంటి ఆంజనేయులు, ఉపకార్యదర్శి ధూళిపాళ్ల చంద్రశేఖర్, సభ్యులు షేక్.ఖాదర్ మస్తాన్, గుండుమల్లి అనిల్ కుమార్, కంభంపాటి వినోద్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## పంటనష్టం అంచనాల్లో అనవసర ప్రచారం వీడి..

# రైతుల్ని ఆదుకోవడంపై దృష్టిపెట్టండి

***పత్తి కొనుగోళ్లకు.. ఇన్ పుట్ సబ్సిడీ అందజేతకు ఎలాంటి సంబంధం లేదు***

***ప్రభుత్వ ఆదేశాలు లేకుండా తోచినట్లు ప్రచారం చేయకండి..***

***క్షేత్రస్థాయిలో పంటనష్టాన్ని పరిశీలించి ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చూడండి***

***వ్యవసాయ అధికారుల, సిబ్బందికి మాజీమంత్రి స్పష్టమైన ఆదేశం***

***యడ్లపాడు, నాదెండ్ల మండలాల్లో మొంథా ధాటికి దెబ్బతిన్న పొలాలను పరిశీలించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి.***







**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, అక్టోబర్ 31 :**

చిలకలూరిపేట : పంటలబీమా పరిహారం.. ఇన్ పుట్ సబ్సిడీ వంటివి అందించడంలో ప్రభుత్వం ఎలాంటి నిబందనలు పెట్టలేదని, సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో పత్తి విక్రయాలకు.. రైతులకు అందించే పరిహారానికి ఎలాంటి సంబంధం లేదని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. శుక్రవారం ఆయన యడ్లపాడు, నాదెండ్ల మండలాల్లో మొంథా ధాటికి నేలకొరిగిన పంటపొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి జరిగిన నష్టం..ఎంత పెట్టుబడి పెట్టారనే వివరాలు తెలుసుకున్నారు. అనంతరం రైతులు, వ్యవసాయ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. తిమ్మాపురం, సొలస, జంగాలపల్లి, నాదెండ్ల గ్రామాల్లో పర్యటించిన ప్రత్తిపాటి.. బురదతో మేటవేసిన పత్తి, మిరప పైర్లను పరిశీలించారు. మొంథా పెనువిపత్తు వ్యవసాయ అధికారుల, సిబ్బందికి సవాల్ విసిరిందని, ఉరకెత్తే దశలో ఉన్న వివిధ పంటలు తిరిగి బతికించి, రైతుకు మేలు చేయడంపై వ్యవసాయ యంత్రాంగం దృష్టి సారించాలని ప్రత్తిపాటి సూచించారు. అనవసర ప్రచారం వదిలేసి, పంటనష్టం సమగ్ర అంచనాలపై దృష్టి పెట్టి, రైతులకు న్యాయం చేయండి. పంటనష్టం అంచనాలో నిబంధనల పేరిట వ్యవసాయ అధికారులు, సిబ్బంది రైతుల్ని ఇబ్బందిపెట్టవద్దని, ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావద్దని ప్రత్తిపాటి ఆదేశించారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు లేకుండా అనవసర ప్రచారం చేయవద్దని, క్షేత్రస్థాయి పర్యటనతో నష్టపోయిన ప్రతి రైతును గుర్తించి, పంట నష్టం లెక్కల్ని సమగ్రంగా రూపొందించాలని, ఎక్కడ అలసత్వం ప్రదర్శించినా ఉపేక్షించేది లేదని ప్రత్తిపాటి వారిని హెచ్చరించారు. నియోజకవర్గ రైతాంగం సమస్యలు, మొంథా ప్రభావంతో దెబ్బతిన్న పంటనష్టం లెక్కింపుపై వ్యవసాయ శాఖ జేడీతో ఫోన్లో మాట్లాడిన ప్రత్తిపాటి.. ఎన్యుమరేషన్ విధివిధానాలపై సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

**ఇన్ పుట్ సబ్సిడీకి.. పత్తికొనుగోళ్లకు సంబంధం లేదు..**

రైతులకు ప్రభుత్వం అందించే ఇన్ పుట్ సబ్సిడీ.. పంటల బీమా సాయానికి, సీసీఐ కేంద్రాల ద్వారా జరిపే పత్తి కొనుగోళ్లకు ఎలాంటి సంబంధంలేదని ప్రత్తిపాటి ఈ సందర్భంగా చెప్పారు. యడ్లపాడు మండల హార్టీ కల్చర్ అసిస్టెంట్ ఈ విధంగా చెబుతున్నారని రైతులు ప్రత్తిపాటికి తెలియచేయగా ఆయన పై విధంగా స్పందించారు. పంట నష్టపోయిన రైతుల్లో ఆందోళన పెంచకుండా వ్యవసాయ అధికారులు, సిబ్బంది, మొంథా నష్టం అంచనాల్ని సమగ్రంగా రూపొందించి ప్రభుత్వానికి సకాలంలో నివేదికలు అందించాలని ప్రత్తిపాటి ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాలు లేకుండా వ్యవసాయ, సచివాలయ అధికారులు లేనిపోని అనవసర ప్రచారాలతో రైతుల్ని భయాందోళనలకు గురిచేస్తే, తర్వాత జరిగే పరిణామాలకు వారే బాధ్యులవుతారని ప్రత్తిపాటి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇంచార్జి తోట రాజారమేష్, టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, మండల అధ్యక్షులు కామినేని సాయిబాబు, జిల్లా రైతు అధ్యక్షులు మద్దూరి వీరారెడ్డి, టీడీపీ నాయకులు అంబటి సోంబాబు, గుర్రం నాగపూర్ణ చంద్రరావు, మద్దూరి శ్రీనివాసరెడ్డి పిచ్చయ్య, లోక బ్రహ్మయ్య, తోకల రాజేష్, జనసేన నాయకులు శరత్, ఎమ్మార్వో, ఏవో, హార్టికల్చర్ అధికారులు, విఆర్వో లు కూటమి ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## నరేంద్రమోడీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి ప్రచారం చెయ్యండి..



**పెన్ పవర్, గుంటూరు, అక్టోబర్, 31**

భారతీయ జనతాపార్టీ గుంటూరు జిల్లా కార్యాలయంలో అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి భారతీయ జనతాపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరియు జోనల్ ఇన్చార్జి అయిన నాగోతు రమేష్ నాయుడు మొట్ట మొదటిసారిగా గుంటూరు విచ్చేసిన సందర్భంగా మండల అధ్యక్షుల పై స్థాయి నాయకుల సమావేశం జరిగినది. ఈసందర్భంగా నాగోతు రమేష్ నాయుడు మాట్లాడుతూ జిల్లాలో ప్రతి మండలంలో నరేంద్రమోడీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి ప్రచారం చేస్తూ పార్టీని అభివృద్ధి చేసే బాధ్యత మీపై ఉందని పార్టీ బలోపేతం చేసే కార్యక్రమంలో మండల అధ్యక్షులు ప్రధాన భూమిక పోషించాలని భవిష్యత్తులో జరగబోయే కార్యక్రమాలను వివరిస్తూ మండలంలో బలమైన నాయకులను గుర్తిస్తూ జరగబోయే ఎన్నికలకు సిద్ధం చేయాలని ఎట్టి పరిస్థితుల్లో కార్పొరేషన్ మున్సిపాలిటీ జడ్పిటిసిలుగా ఎంపీటీసీలుగా సర్పంచ్లుగా గెలిచి ప్రజలకు సేవ చేయాలని లక్ష్యంతో పనిచేయాలని వారు సూచించారు. అనంతరం జిల్లా అధ్యక్షులు జరగబోయే కార్యక్రమాల గురించి 3,4 తేదీలలో అన్ని మండలాలకు పర్యటన గురించి ఇన్చార్జిలను ప్రకటించడం జరిగినది. చెరుకూరి తిరుపతిరావు అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బిట్రా శివన్నారాయణ,రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్ నారాయణ, ట్యూబకో బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్,అధికార ప్రతినిధి దర్శనపు శ్రీనివాస్, మీడియా ప్యానలిస్ట్ తాడువాయి రామకృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈదర శ్రీనివాసరెడ్డి,రాష్ట్ర లిటరేచర్ కన్వీనర్ పాలపాటి రవికుమార్, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్, పల్నాడు జిల్లా ఇన్చార్జి కొక్కెర శ్రీనివాస్ యాదవ్, నెల్లూరు జిల్లా ఇన్చార్జి గాజుల వెంకయ్య నాయుడు,చేనేత కార్మిక సెల్ కన్వీనర్ జగ్గారపు శ్రీనివాసు, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు పాండురంగ విఠల్, సీనియర్ నాయకులు కొత్తూరు వెంకట సుబ్బారావు, జిల్లా ప్రధాన కార్యదర్శిలు బజరంగ్ రామకృష్ణ, దేసు సత్యనారాయణ, తోట శ్రీనివాసు, మాజీ ప్రధాన కార్యదర్శులు చరక కుమార్ గౌడ్, ఉమామహేశ్వరరావు, జిల్లా పదాధికారులు, మండల అధ్యక్షులు, మండల ఇన్చార్జులు, జిల్లా లోని మోర్చా అధ్యక్షులు,జిల్లాలోని రాష్ట్ర స్థాయి నాయకులు, జిల్లా నాయకులు, ఇతర ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వంపై నిందలు మోపాలనే ఆలోచనలు జగన్ రెడ్డి మానుకోవాలి

**విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్**

**98 శాతానికి పైగా విద్యుత్ పునరుద్ధరణ పనులు పూర్తి**

**సీఎం ముందు చూపుతో యంత్రాంగం అప్రమత్తం**

**తుఫాను పునరావాస కేంద్రాల్లో వైద్య శిబిరాల నిర్వహణ**

**ప్రజల సానుభూతి కోసమే అసత్య ప్రచారాలు**



**పెన్ పవర్, అక్టోబర్ 31, అద్దంకి**

మొంథా తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ఇప్పటికే 98 శాతానికి పైగా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తుఫాను వచ్చే అవకాశం ఉందన్న ముందస్తు హెచ్చరికలు వెలువడినే వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజా ప్రతినిధులు, ప్రజలతో పాటు అధికార యంత్రాంగం మొత్తాన్నీ అప్రమత్తం చేశారని మంత్రి వెల్లడించారు. మూడు డిస్కంల పరిధిలోని సుమారు 1500 మంది సిబ్బందిని తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక విధులు కేటాయించామని తెలిపారు. విశాఖపట్నం, మచిలీపట్నం, బాపట్ల వంటి అత్యధిక తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక అధికారులను నియమించి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా చేశామన్నారు. తుఫాను పునరావాస కేంద్రాల్లో ఎప్పుడూ లేని విధంగా వైద్య శిబిరాలను నిర్వహించి బాధితులను కాపాడామని మంత్రి గొట్టిపాటి తెలిపారు.

**12, 500 పైగా కొత్త విద్యుత్ స్తంభాలు**

సముద్ర తీర ప్రాంతాలకు దగ్గరగా ఉన్న గ్రామాలు, పట్టణాలలో 80 కిలోమీటర్లకు పైగా వేగంతో గాలులు వీచి చాలా స్తంభాలు విరిగి పోయాయని, కండక్టర్లు డ్యామేజ్ అయ్యాయని, ట్రాన్స్ఫార్మర్లు కాలిపోయాయని మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు. ముందుస్తు జాగ్రత్త చర్యలో భాగంగా విద్యుత్ స్తంభాలను, ట్రాన్స్ ఫార్మర్లను కూడా అందుబాటులో ఉంచుకున్నామని చెప్పిన ఆయన, ధ్వంసం అయిన ప్రాంతాల్లో మొత్తం 12,500 కరెంట్ పోల్స్ ను కొత్తవి మార్చామని చెప్పారు. అదే విధంగా 2,900 కిలోమీటర్ల మేర కండక్టర్లను, సుమారు మూడు వేల వరకు ట్రాన్స్ ఫార్మర్లను మార్పిడి చేశామని మంత్రి పేర్కొన్నారు. భారీ స్థాయిలో గాలులతో చెట్లు కూలి, స్తంభాలు విరిగిపోవడంతో నష్టం జరిగిందని తెలిపారు. సీఎం చంద్రబాబు ముందస్తు అప్రమత్తతో రాష్ట్రంలో ఎప్పుడూ లేని విధంగా 24 గంటల్లోనే తుఫాను ప్రభావం నుంచి బయట పడి సాధారణ స్థితికి వచ్చామని మంత్రి చెప్పారు. అత్యధిక వర్షపాతం నమోదు అయిన నెల్లూరు, కావలితో పాటు మచిలీపట్నం వంటి కొన్ని ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్తగా పవర్ షట్ డౌన్ చేశామన్నారు. పరిస్థితి అనుకూలించిన తరువాత రీస్టోర్ చేశామని తెలిపారు. బాపట్ల, పర్చూరుతో పాటు మచిలీపట్నం వంటి కొన్ని ప్రాంతాల్లో సముద్రాన్ని తలపించే విధంగా నీరు నిలిచిపోయిందని మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు. అయినా సీఎం చంద్రబాబు దిశా నిర్దేశంతో ఎటువంటి ప్రాణ నష్టం జరగకుండా బయట పడ్డామన్నారు. పునరావాస కేంద్రాల్లో మంచి ఆహారంతో పాటు వేడి నీళ్లు కూడా బాధితులకు అందించి వారికి అన్ని విధాలా బాసటగా నిలిచామని తెలిపారు. అదే విధంగా పంటలు నష్టపోయిన రైతులకు సత్వరమే పరిహారం అందే విధంగా చర్యలు తీసుకుంటామని వారికి ధైర్యం చెప్పామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇళ్లకు పూర్తి స్థాయిలో విద్యుత్ సరఫరా పునరుద్ధరించామని, ఆక్వా, అగ్రి కనెక్షన్లు వంటి మిగిలిన అందరికీ 48 గంటల్లో విద్యుత్ సరఫరా అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. విద్యుత్ స్తంభాలు నేలకొరిగిన కొన్ని ప్రాంతాల్లో స్థానికులతో పాటు కూటమి కార్యకర్తల సహాయ సహకారాలు తీసుకుని యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ సరఫరా పునరుద్ధరించామని మంత్రి రవికుమార్ గుర్తు చేశారు. ఎటువంటి ప్రాణ నష్టం జరగకుండా ఉండాలన్న ఉద్దేశంతో సీఎం చంద్రబాబు నాయుడు ఆలోచనలకు అనుగుణంగా చేసిన పని ఎంతో సంతృప్తి నిచ్చిందన్నారు.

**మట్టి అంటకుండా జగన్ రెడ్డి కార్పెట్ పరామర్శలు.**

ఐదేళ్లు అధికారం ఇచ్చిన ప్రజలను నిండా ముంచి సర్వనాశనం చేసిన జగన్మోహన్ రెడ్డికి రాష్ట్రం గురించి మాట్లాడే అర్హత లేదని మంత్రి గొట్టిపాటి విమర్శించారు. గతంలో తుఫాను పరామర్శలకు కాళ్లకు మట్టి అంటకుండా కార్పెట్ వేయించుకుని నడవటం ప్రజలు మరచిపోలేదని ఎద్దేవా చేశారు. హుద్ హుద్ తుఫాను, బెజవాడ బుడమేరు వరదల సమయంలో సీఎం చంద్రబాబు ఎంత కష్టపడి పని చేశారో ప్రజలు స్వయంగా చూశారన్నారు. ప్రజలను దోచేసిన జగన్ కు., పేదలకు సేవ చేసే చంద్రబాబుకు తేడాను అప్పుడే గమనించారన్నారు. ప్రజల సానుభూమి ఏవిధంగా పొందాలన్న ఆలోచనతో కూటమి ప్రభుత్వం చేస్తున్న మంచి కూడా జగన్ కు కనబడటం లేదన్నారు. ప్రజల మన్ననలు పొందుతూ పని చేస్తున్న చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వంపై నిందలు వేయాలనే ఆలోచనతో జగన్ రెడ్డి అసత్య ప్రచారాలు చేస్తున్నాడని మంత్రి గొట్టిపాటి మండిపడ్డారు.

**ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించిన విద్యుత్ సిబ్బంది**

మొంథా తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ శాఖకు చెందిన వేలాది మంది ఉద్యోగులు రాత్రనకా, పగలనకా ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించారని మంత్రి గొట్టిపాటి రవికుమార్ వారిని అభినందించారు. చాలా ప్రాంతాల్లో 24 గంటల్లోనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారని ఆయన గుర్తు చేశారు. జోరు వానలో సైతం 48 గంటలు నిద్రాహారాలు మాని కర్తవ్య దీక్షలో మునిగిన అందరికీ హేట్స్ ఆఫ్ అంటూ మంత్రి ధన్యవాదాలు తెలిపారు. విపత్కర సమయంలోనూ విధులు నిర్వహించడం విధుల పట్ల వారికి ఉన్న అంకిత భావానికి నిదర్శమని ఈ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు.

# ఏపీ స్టేట్ లెప్ర సొసైటీ వారి సేవలు అభినందనీయం

### కమిషనర్ రఘునాథరెడ్డి





**పెన్ పవర్ బ్యూరో బాపట్ల అక్టోబర్ 31**

ఇటీవల కురిసిన భారీ వర్షాలు మరియు మోంతా తుఫాన్ ప్రభావం వలన ఆశ్రయం కోల్పోయిన బేతనీ కాలనీ లోని కుష్టి వ్యాధిగ్రస్తులకు ఏపీ స్టేట్ లెప్ట్ రా సొసైటీ వారి సహకారంతో బ్రెడ్ బిస్కెట్ ప్యాకెట్స్ వాటర్ బాటిల్స్ పాల ప్యాకెట్లను కాలనీలోని 135 మంది కుష్టి వ్యాధిగ్రస్తులకు బాపట్ల మున్సిపల్ కమిషనర్ గారి చేతుల మీదుగా అందజేసి ఉన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ రఘునాథరెడ్డి మాట్లాడుతూ లెప్ట్ రా సొసైటీ వారీ సేవలు అభినందనీయమని వ్యాధిగ్రస్తులకు ఈ విధంగా సేవలు చేయటం చాలా గొప్ప విషయం అన్నారు. . ఈ కార్యక్రమంలో మున్సిపల్ డి ఈ కృష్ణారెడ్డి మరియు సచివాలయ సిబ్బంది కాలనీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# మానవతా దృక్పథంతో త్రినేత్రం మొబైల్స్ సేవా కార్యక్రమం



**వేటపాలెం,పెన్ పవర్, అక్టోబర్ 31:**

వేటపాలెం మండలంలోని కొత్తపేట పంచాయతీ పరిధి రామాపురం కృపానగర్‌లో చీరాల త్రినేత్రం మొబైల్స్ వారు మానవతా దృక్పథంతో సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికంగా 30 మందికి నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో త్రినేత్రం మొబైల్స్ అధినేత సుబ్బు యాదవ్, తెలుగుదేశం పార్టీ నాయకులు గవిని వెంకటేశ్వర్లు, రామాపురం సొసైటీ అధ్యక్షుడు కొండూరి వెంకటేశ్వర్లు, షేక్ అహ్మద్, షేక్ బాషా, కొమ్మనబోయిన గోపి తదితరులు పాల్గొన్నారు. నిత్యావసర సరుకుల పంపిణీ సందర్భంగా స్థానిక ప్రజలు త్రినేత్రం మొబైల్స్ యాజమాన్యానికి, కార్యక్రమ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సంక్షేమం కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలని ఆకాంక్షించారు.

# మెంతా బాధితులకు బియ్యం సరుకులు



**పెన్ పవర్ బ్యూరో బాపట్ల అక్టోబర్ 31**

కర్లపాలెం, మేజర్ న్యూస్.కర్లపాలెం మండలం ఎట్రావారిపాలెం గ్రామంలో మెంతా తుపాను బాధితులకు గ్రామ సర్పంచ్ చీరాల వెంకటలక్ష్మి 25 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు.ఈ సందర్భంగా వెంకటలక్ష్మి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ముందు జాగ్రత్తలు తీసుకోవడం వల్ల ఆస్తి,ప్రాణ నష్టాలు జరగలేదన్నారు.తుపాను బాధితులను ప్రభుత్వం ఆదుకొంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యూనిట్ ఇంచార్జి చీరాల శ్రీనివాసరెడ్డి, వార్డు మెంబర్ నాగ బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నీట మునిగిన పంట పొలాలు పరిశీలన

**చిన్నగంజాం,పెన్ పవర్,అక్టోబర్ 31**

మోంథ తుపాను నేపథ్యంలో మండలంలో జరిగిన పంటనష్టాలను బాపట్ల జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగ గౌరవ డిపిఎమ్ ఎస్.హెచ్. హుస్సేన్ వ్యవసాయ అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. మండలంలో పలు గ్రామాల్లోని పంటలను పరిశీలించారు. స్థానిక రైతులతో మాట్లాడారు. ఇ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి చంద్రశేఖర్, అడిషనల్ డిపిఎం మోహన్, డిపిపి శ్రీనివాసరావు,ఎన్ఎఫ్ఏ శ్రీవల్లి , చీరాల డివిజన్ మాస్టర్ ట్రైనర్ భారతి, యూనిట్ ఇంచార్జ్ జయమ్మ, మండలంలోని ప్రకృతి వ్యవసాయ కేడర్ పాల్గొన్నారు.



# ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, సమస్యల పరిష్కారంపై అప్పటికప్పుడే యంత్రాంగంతో మాట్లాడిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి

జాతీయ రహదారి విస్తరణకు భూములిచ్చిన రైతులకు నేటికీ పరిహారం ఇవ్వకపోతే వ్యవస్థలపై ప్రజల్లో అపనమ్మకం ఏర్పడదా? : మాజీమంత్రి ప్రత్తిపాటి.

167 ఏ జాతీయ రహదారి విస్తరణకోసం కోరిన వెంటనే భూములు, ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇచ్చిన వారికి నేటికి పరిహారం ఇవ్వకపోతే రైతుల్లో వ్యవస్థలపై అపనమ్మకం ఏర్పడదా?

ధర్నాలు,ఆందోళనలు చేసే వరకు రైతులు రావడం నిజంగా బాధాకరం .. తక్షణమే సమస్య పరిష్కారమయ్యేలా చూడాలని పల్నాడు జేసీని కోరిన ప్రత్తిపాటి.

ఎండుగుంపాలెం ఎస్సీ కాలనీ వాసులకు అవసరమైన శ్మశానస్థలాన్ని వెంటనే కొనుగోలు చేసి, వారి సమస్య పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ కు సూచించిన మాజీమంత్రి ప్రత్తిపాటి.









**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, అక్టోబర్ 31 :**

చిలకలూరిపేట : ప్రభుత్వాలు తమకు న్యాయం చేస్తాయని నమ్మి అభివృద్ధిపనులకు భూములు, స్థలాలు ఇచ్చే రైతులకు వెంటనే న్యాయం చేయకపోతే పాలనా వ్యవస్థలపై వారికి అపనమ్మకం ఏర్పడదా అని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ప్రశ్నించారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఆయన ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈసందర్భంగా జాతీయ రహదారి విస్తరణకు వ్యవసాయ భూములు, ఇళ్లు, స్థలాలు ఇచ్చిన రైతులు ప్రత్తిపాటిని కలిసి తమ సమస్య తెలియచేశారు. న్యాయంగా రావాల్సిన పరిహారం కోసం ఆందోళనలు, దర్నాలు చేస్తున్నా సంబంధిత అధికారులు స్పందించడం లేదని వాపోయారు. రైతుల సమస్య విన్న ప్రత్తిపాటి వారి సమక్షంలోనే నేరుగా జాయింట్ కలెక్టర్‌తో మాట్లాడారు. వెంటనే సమస్యపై దృష్టి పెట్టాలని, రహదారి విస్తరణ పనులు పూర్తయినా నేటికీ వారికి పరిహారం ఇవ్వకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఈ విధంగా జాప్యం చేస్తే రైతులు భవిష్యత్ లో ప్రభుత్వాలు చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు ఎలా సహకరిస్తారన్నారు. అలానే ఎండుగుం పాలెం ఎస్సీ కాలనీ వాసులు శ్మశానవాటికకు అవసరమైన భూమిని వెంటనే ప్రభుత్వమే కొనుగోలు చేసి తమకు అప్పగించాలని గతంలో అర్జీ ఇచ్చారని, మరలా నేడు సమస్యను మరోసారి తన దృష్టికి తీసుకొచ్చారని ప్రత్తిపాటి జేసీకి తెలిపారు. రెండు సమస్యల్ని వెంటనే పరిష్కరించి ప్రజలకు న్యాయం చేయాలన్న ప్రత్తిపాటి సూచనపై జేసీ సూరజ్ గనోరే స్పందించారు. అర్జీలు పరిశీలించి రెండు సమస్యల్ని వీలైనంత త్వరగా పరిష్కరిస్తారని స్పష్టంచేశారు. శ్మశాన వాటిక భూమిని రైతుల నుంచి భూసేకరణ పద్ధతిలో తీసుకోవాల్సి ఉన్నందున ఆర్థిక పరమైన అంశమైనందున ప్రభుత్వాన్ని సంప్రదించి నిర్ణయం తీసుకుంటామని జేసీ తెలిపారు. వివిధ సమస్యలపై ప్రజలిచ్చిన అర్జీలు స్వీకరించిన ప్రత్తిపాటి, వారి సమక్షంలోనే అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారం దిశగా చొరవ చూపారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇంచార్జి తోట రాజారమేష్, టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమాధ్ ఖాన్, మండల అధ్యక్షులు బండారుపల్లి సత్యనారాయణ, జవ్వాజి మధన్ మోహన్, కామినేని సాయిబాబు, టీడీపీ నాయకులు మద్దూరి వీర రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి మాద్దుమాల రవి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులున్నారు.

# వేటపాలెంలో తుఫాన్ బాధితులకు సహాయం

### మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి జన్మదినం సందర్భంగా పంపిణీ



**వేటపాలెం,పెన్ పవర్,అక్టోబర్ 31**

ఒంగోలు మాజీ పార్లమెంట్ సభ్యుడు, చీరాల మాజీ శాసనసభ్యుడు కరణం బలరామకృష్ణమూర్తి పుట్టినరోజు సందర్భంగా వేటపాలెం మండలం దేశాయిపేట పంచాయతీ పరిధిలోని నవజ్యోతి కొత్తకలనీలో మేంథ తుఫాన్ వల్ల నష్టపోయిన కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం జరిగింది. ఈ సేవా కార్యక్రమంలో వేటపాలెం మండల వైఎస్సార్సీపీ అధ్యక్షుడు సాదు రాఘవరావు, చీరాల నియోజకవర్గ మహిళా అధ్యక్షులు సీతామహాలక్ష్మి, మాజీ అధ్యక్షులు బొడ్డు సుబ్బారావు, వేటపాలెం బీసీ సెల్ అధ్యక్షులు యారసు ఉమామహేశ్వరరావు, మండల మహిళా అధ్యక్షులు నర్మదా ప్రశాంతి, వేటపాలెం యూత్ అధ్యక్షులు ఖాదర్, మైనారిటీ అధ్యక్షులు ఎస్కె ఖాదర్, ఆసిఫ్, నూరుల్లాహ్, పందిళ్లపల్లి గ్రామ పార్టీ అధ్యక్షులు మల్లేశ్వరరావు, ఎస్కె షరీఫ్, పిట్టు హనుమంతరెడ్డి, రామిరెడ్డి, పృధ్వి ఆంజనేయులు, గుంటూరు శ్రీనివాసరావు, లేళ్ల భాస్కరరావు, కౌశిక్, దంతం వెంకట సుబ్బారావు, హౌలే, చొప్పరపు సుబ్బారావు, కంచి సాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కరణం బలరామకృష్ణమూర్తి ప్రజాసేవా తపన అందరికీ ఆదర్శమని, ఆయన సేవా భావాన్ని కొనసాగించే క్రమంలో తుఫాన్ బాధిత కుటుంబాలకు సహాయం అందించామని తెలిపారు.

# చీరాలలో ఘనంగా రన్ ఫర్ యూనిటీ





**చీరాల, పెన్ పవర్ ,అక్టోబర్ 31**

సర్ధార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా రాష్ట్రీయ ఏక్తా దివస్ వేడుకలలో భాగంగా చీరాల పట్టణంలో యూనిటీ రన్ ఘనంగా నిర్వహించారు. చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య జెండా ఊపి రన్ ఫర్ యూనిటీకి శుభారంభం చేశారు.సివిల్, ఎఆర్, ఎపిఎస్పీ, హోంగార్డులు, క్రీడాకారులు, ఎన్‌సీసీ విద్యార్థులు, కూటమి నాయకులు తదితరులు భారీ ఎత్తున ఈ ఐక్యతా పరుగు లో పాల్గొన్నారు. వాడరేవు కీర్తి వారి పాలెం జంక్షన్ నుండి న్యూ హైవేలోని మస్తాన్ రెడ్డి గెస్ట్ హౌస్ కూడలి వరకు రన్ కొనసాగింది.పరుగులో గెలుపొందిన క్రీడాకారులకు ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య బహుమతులు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సర్ధార్ వల్లభాయ్ పటేల్ భారత ఏకీకరణలో చేసిన కృషిని స్మరించడానికి ప్రతి సంవత్సరం అక్టోబర్ 31న ఐక్యతా దినంగా జరుపుకుంటామని అన్నారు. దేశ సమైక్యత, భద్రత కోసం ప్రతి పౌరుడు కృషి చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.ఐక్యతా దినంగా జరుపుకుంటున్న ఈ సందర్భంలో "దేశం యొక్క ఐక్యత, సమగ్రత, భద్రతను కాపాడటానికి నన్ను నేను అంకితం చేసుకుంటాను" అనే ప్రతిజ్ఞను ఎమ్మెల్యే అందరితో కలసి పఠించారు.చీరాల డీఎస్పీ, సీఐలు, ఆర్‌ఐలు, ఎస్సైలు, ఆర్‌ఎస్సైలు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు, స్థానిక నాయకులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# పంట పొలాలలోని నీరు దిగువకు పోయేందుకు తక్షణ చర్యలు చేపట్టాలి-జిల్లా కలెక్టర్

**స్టాఫ్ రిపోర్టర్ మచిలీపట్నం (పెన్ పవర్)అక్టోబరు 31:**



తుపాను కారణంగా ముంపుకు గురైన పంట పొలాలలోని నీరు బయటకు పోయేందుకు వ్యవసాయ అధికారులు, ఇరిగేషన్ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సమన్వయం చేసుకుంటూ అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ నుంచి ఇరిగేషన్ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు (ఏఈ), వ్యవసాయ అధికారులతో(ఏఓ) టెలికాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. మొంథా తుపాను కారణంగా జిల్లాలో ముంపుకు గురైన పంట పొలాల్లోని నీరు బయటకు పోయేందుకు తీసుకుంటున్న చర్యలు, ఇరిగేషన్ మురుగుకాలువల స్థితిగతులపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ముంపుకు గురైన పంట పొలాల ప్రాంతాలను సంబంధిత ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు తెలియపరచాలని, తద్వారా నీరు బయటకు పోయేందుకు వీలుగా సాగునీటి మురుగు కాలువల్లోని గుర్రపుడెక్క, తూడు తొలగింపుకు తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. కృత్తివెన్ను మండలంలోని సీతనపల్లి నీలిపూడి మధ్య వెళ్లే డ్రైనేజీ గుర్రపు డెక్క, తూడుతో నిండిపోయిందని, దీనివల్ల ఆ ప్రాంత పరిధిలోని పంట పొలాలలోని నీరు సవ్యంగా బయటకి పోవడం లేదని ఏవో కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అదేవిధంగా బంటుమిల్లి మండలం చోరంపూడి వద్ద డ్రైనేజీ తూములు పూడుకుపోయి నీరు పారడం లేదని, దీనివల్ల ములపర్రు, ఆముదాలపల్లి తదితర ప్రాంతాల పొలాలలోని నీరు తగ్గడం లేదని తెలిపారు. కృష్ణానదికి వరద నీరు పెరగడం వల్ల నాగాయలంక, కోడూరు మండలాల్లో మురుగు కాలువలు పొంగి ఉన్నాయని దీనివల్ల పొలాల్లోని నీరు ముందుకు సాగడం లేదని అధికారులు కలెక్టర్కు వివరించారు. ఏఓలు, ఏఈలు పంట పొలాలలోని నీరు బయటకు పంపటం అత్యధిక ప్రాధాన్యతాంశంగా భావించి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

# చీరాల మున్సిపల్ కౌన్సిల్‌లో టెన్షన్

### - టిడిపి వర్గాల్లో ముసలం





**చీరాల,పెన్ పవర్,అక్టోబర్ 31**

టిడిపి ఆధీనంలో ఉన్న చీరాల మున్సిపల్ కౌన్సిల్‌లో శుక్రవారం ఉద్రిక్తత నెలకొంది. జరగాల్సిన కౌన్సిల్ సమావేశం కోరం లేమి కారణంగా వాయిదా పడింది. ఈ నేపథ్యంలో టిడిపి అనుకూల కౌన్సిలర్లు సల్లూరి సత్యానందం, గుంటూరు ప్రభాకరరావులు చైర్మన్ మించాల సాంబశివరావుపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.మీడియా సమావేశంలో మాట్లాడుతూ, చైర్మన్ ఒంటెత్తు నిర్ణయాలతో కౌన్సిల్ కార్యకలాపాలు దెబ్బతింటున్నాయని వారు ఆరోపించారు. ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యం విస్మరించి, వ్యక్తిగతంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. మించాల సాంబశివరావు చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి మూడు నెలలు కూడా గడవకముందే అంతర్గత అసమ్మతి బహిర్గతం కావడం చీరాల రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# చీరాల క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్

### - ప్రజల సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చిన ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య



**చీరాల, పెన్ పవర్ ,అక్టోబర్ 31**

చీరాల క్యాంపు కార్యాలయంలో శనివారం ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య పాల్గొని ప్రజల నుండి వివిధ అర్జీలు స్వీకరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను విభాగాల వారీగా సంబంధిత అధికారులకు పంపించి, త్వరితగతిన పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ ప్రజా దర్బార్‌లో మొత్తం 135 అర్జీలు స్వీకరించగా, అందులో పెన్షన్‌కు సంబంధించినవి 20, ఇళ్ల స్థలాలకు సంబంధించినవి 110, మరియు ఇతర సమస్యలకు సంబంధించినవి 5 అర్జీలు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో చీరాల మండల అధ్యక్షులు గంజి పురుషోత్తం, శివ నాగమల్లేశ్వరి, గూడూరు శివరాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# సుగాలీ కాలనీ తుపాను నిర్వాసితులకు నగదు, నిత్యావసరాలు అందించిన మాజీమంత్రి ప్రత్తిపాటి

వరదనీటి సమస్యను వచ్చే వర్షాకాలం నాటికి పరిష్కరిస్తామని 167 ఏ బైపాస్.. ఎన్.హెచ్.-16 అధికారులు హామీ ఇచ్చారు : మాజీమంత్రి ప్రత్తిపాటి.

నీటి ప్రవాహా తూముల సైజు తగ్గినందునే వరదనీరు పట్టణంలోని పలువార్డులు, పసుమర్రు ఎస్టీ కాలనీని ముంచేసిందని తెలిపారు





**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, అక్టోబర్ 31**

చిలకలూరిపేట : మొంథా తీవ్రత వల్ల జరిగే నష్టాన్ని నివారించడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు విజయం సాధించారని, జరిగిన నష్టాన్ని కేంద్రానికి నివేదించి రైతులకు న్యాయం చేయడానికి కృషి చేస్తున్నారని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. పట్టణంలోని సుగాలీ కాలనీలో 48 మంది నిర్వాసితులకు నగదు, నిత్యావసరాలు అందించారు. అనంతరం పత్రిక సమావేశంలో మాట్లాడారు. గత ఐదేళ్లలో పరిపాలనా వ్యవస్థలను విధ్వంసం చేసినవారు.. కోట్ల రూపాయలు బకాయిలు పెట్టిన వారు నేడు రాజకీయాల కోసం అర్థం లేకుండా మాట్లాడుతున్నారని ప్రత్తిపాటి అసహనం వ్యక్తంచేశారు. పంట నష్టం.. పంటల బీమా.. ఇన్ పుట్ సబ్సిడీ.. గిట్టుబాటు ధరలపై జగన్ రాజకీయాలు చేస్తున్నాడని, గతంలో తాను అధికారంలో ఉండగా రైతులకు ఏంన్యాయం చేశాడో చెప్పాలని ప్రత్తిపాటి ప్రశ్నించారు. పట్టణ, పరిసర ప్రాంతాలను ముంచెత్తిన వరదనీటి సమస్య పరిష్కరిస్తామని ఎన్.హెచ్-16, 167 -ఏ బైపాస్ అధికారులు, ఇంజనీర్లు హామీ ఇచ్చారు. పట్టణాన్ని, చుట్టుపక్కల ప్రాంతాలను ముంచెత్తిన వరదనీటి సమస్యకు జాతీయ రహదారి విస్తరణ పనుల్లో లోపాలే కారణమని, సమస్యపై 167 -ఏ బైపాస్ పీడీ ,ఇంజనీర్లతో పాటు, ఎన్.హెచ్-16 అధికారులతో మాట్లాడానని, విస్తరణ పనుల్లో ఎక్కడ లోపముందో గుర్తించినట్టు వారు చెప్పారని ప్రత్తిపాటి చెప్పారు. ఓగేరు, కుప్పగంజి వాగు ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చేపట్టే రూ.20 నుంచి 25 కోట్ల విలువైన పనులకు డిసెంబర్లో టెండర్లు పిలుస్తామని ఎన్.హెచ్ పీడీ చెప్పారని ప్రత్తిపాటి తెలిపారు. అలానే 167-ఏ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సంజీవనాయుడుతో మాట్లాడానని, డ్రైనేజ్ నీటి కోసం ఏర్పాటుచేసిన తూముల సైజులు తగ్గించడం వల్లే అధికంగా వచ్చిన వరదనీరు పసుమర్రు ఎస్టీ కాలనీని ముంచెత్తినట్టు చెప్పారని ప్రత్తిపాటి తెలిపారు. ఈ సమస్యను కూడా పరిష్కరిస్తామని ఈ.ఈ చెప్పారని, వచ్చే వర్షాకాలం నాటికి మరలా వరద ప్రవాహం రాకుండా అన్ని చర్యలు తీసుకుంటామని జాతీయ రహదారుల విభాగం తెలియచేసిందని ప్రత్తిపాటి చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇంచార్జి తోట రాజారమేష్, టిడిపి సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమాధ్ ఖాన్, ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, మున్సిపల్ కమిషనర్ పతి శ్రీహరి బాబు, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, కూటమి నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తుఫాన్ బాధితులకు అండగా ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య




**చీరాల,పెన్ పవర్,అక్టోబర్ 31**

చీరాల మండలం వాడరేవు గ్రామంలో తుఫాన్ ప్రభావిత కుటుంబాలను పరామర్శించిన చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య నిత్యావసర సరుకులు, బియ్యం పంపిణీ చేశారు. తుఫాన్ కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలను ధైర్యం చెప్పిన ఎమ్మెల్యే, ప్రభుత్వం పూర్తిస్థాయిలో ప్రజల అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, శ్రేయోభిలాషులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు ఎమ్మెల్యే మాలకొండయ్యకు ధన్యవాదాలు తెలిపారు.

# రేపు పెడనలో వైయస్ షర్మిల పర్యటన



**స్టాఫ్ రిపోర్టర్ మచిలీపట్నం (పెన్ పవర్) అక్టోబర్ 31:**

మొంథా తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించి బాధిత రైతులను పరామర్శించేందుకు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ కమిటీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల శనివారం పెడన నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు గన్నవరం ఎయిర్పోర్ట్ నుండి బయలుదేరి ఉదయం 11 గంటలకు పెడన చేరుకోనున్నారు. పంటలు నష్టం తీవ్రంగా నమోదైన ప్రాంతాలను స్వయంగా పరిశీలించి రైతుల సమస్యలను తెలుసుకోనట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

## భారతమ్మ ముద్దుబిడ్డలు వల్లభాయ్ పటేల్, ఇందిరాగాంధీ లు చిలకలూరిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ

**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, అక్టోబర్ 31**

దేశం కోసం, దేశ ప్రజల సంక్షేమం ,అభివృద్ధి కోసం తమ జీవితాలను అంకితం చేసిన మహనీయులు సర్దార్ వల్లభాయ్ పటేల్ , ఇందిరా గాంధీ లని చిలకలూరిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త ఎం రాధాకృష్ణ అన్నారు. నవభారత నిర్మాణంలో పండిట్ జవహర్లాల్ నెహ్రూ తో పాటు సర్దార్ వల్లభాయ్ పటేల్ కీలక పాత్ర పోషించి చిరస్మరణీయులైతే ఇందిరమ్మ కొద్దిమంది కోటీశ్వరుల చేతిలో చిక్కుకుపోయి కోటీశ్వరులను మరింత కోటీశ్వరులుగా చేయడం కోసమే పని చేస్తున్న బ్యాంకింగ్ వ్యవస్థను పేద ప్రజల ముంగిటకు తీసుకువచ్చి పేద ప్రజలు కూడా ధనవంతులు కావచ్చు అని నిరూపించి ఆదర్శ పాలకురాలుగా చరిత్ర పుటలకు ఎక్కారని అన్నారు. ఇందిరా గాంధీ ప్రపంచ చిత్రపటంలో బంగ్లాదేశ్ అనే ఒక నూతన దేశ ఆవిర్భావానికి కారకురాలై ప్రపంచ ప్రజల చేత అపర కాళికా మాత అని పిలిపించుకున్న ధీరురాలని వేనోళ్ల కొనియాడారు. రాష్ట్ర కాంగ్రెస్ మాజీ కార్యదర్శి ఉప్పుటూరు అనిల్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఇందిరా గాంధీ సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటాలకు నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు . ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ మాజీ కార్యదర్శి ఉప్పుటూరి అనిల్ కుమార్ రాష్ట్ర కాంగ్రెస్ మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ నస్రుద్దీన్ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు చే రెడ్డి శ్రీరామ్ రెడ్డి జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రెడ్డెం నర్సిరెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఇంటూరి భవాని వెంకటేష్ నాదెండ్ల, ఎడ్లపాడు, చిలకలూరిపేట మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ బాజీ, సాగి నరసింహారావు, మద్దాలి శ్రీనివాసరావు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొడ్డపాటి రామ కోటేశ్వరరావు పార్టీ నాయకులు అల్లం సుబ్బారావు దాసరి శ్యాం బాబు పల్లె పోగు రాజు మిరియాల వెంకటరత్నం కె అంజిరెడ్డి షేక్ సునీల్ బాబు దావల మరియ దాసు ఏ. డేవిడ్ రాజు మాడా కోటి తదితరులు పాల్గొన్నారు.




# విలీన గ్రామాల అంశమే ఎజెండాలో హాట్‌టాపిక్..

వాదోపవాదాలతో ముగిసిన చిలకలూరిపేట మున్సిపల్ సమావేశం..




**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, అక్టోబర్ 31 :**



చిలకలూరిపేట: మున్సిపల్ సాధారణ సమావేశం శుక్రవారం తీవ్ర వాదోపవాదాల మధ్య ముగిసింది.అనేక అంశాలు ఎజెండాలో ఉన్నప్పటికీ,విలీన గ్రామాల సమస్య ప్రధాన చర్చా విషయంగా నిలిచింది.సభ్యుల మధ్య పరస్పర నిందారోపణలు, వాదప్రతివాదాలతో కౌన్సిల్ హాల్‌లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పట్టణములోని మైలవరపు గుండయ్య కౌన్సిల్ హాలులో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని అధ్యక్షతన సమావేశం జరిగింది.

**ఈ-పాస్ యంత్రాల చెల్లింపుపై ఘర్షణాత్మక చర్చ..**

మొబైల్ ఈ-పాస్ మిషన్ల కొనుగోలు,చెల్లింపులపై కౌన్సిల్ సమావేశంలో తీవ్ర చర్చ జరిగింది. మున్సిపల్ కమిషనర్ పి. శ్రీహరి బాబు మాట్లాడుతూ ప్రభుత్వమే ఈ యంత్రాలను సరఫరా చేసిందని, కానీ అసలు మొత్తాన్ని సకాలంలో చెల్లించకపోవడం వల్ల రూ. 1,18,472 నుంచి రూ. 2,96,659 వరకు మొత్తం పెరిగి చెల్లించాల్సి వచ్చిందని తెలిపారు.అయితే ఈ ఆలస్యంపై 37వ వార్డు కౌన్సిలర్ పాములపాటి శివకుమారి చైర్మన్‌ను నిలదీస్తూ "డబ్బులు లేవా? లేక కట్టకుండా వడ్డీ చెల్లించాలనుకున్నారా?" అంటూ ఘాటుగా ప్రశ్నించారు. దీనికి కమిషనర్ "గతంలో ఆలస్యం జరిగింది. ఇటీవలే చెల్లించాం" అని సమాధానమిచ్చారు. రాష్ట్రంలోని ఇతర మున్సిపాలిటీలూ ఇలాంటి పరిస్థితి ఎదుర్కొన్నట్లు ఆయన తెలిపారు.

**డ్రైనేజీ, వర్షపు నీటిపై చర్చ..**

డ్రైనేజీ సమస్యపై 37వ వార్డు కౌన్సిలర్ శివకుమారి ప్రశ్నించగా, తుఫానుకారంగా ఏఎంజి ప్రాంతంలో రాత్రి జేసీబీల సహాయంతో నీరు తొలగించామని కమిషనర్ వివరించారు.కానీ కొన్ని ప్రాంతాల్లో ఇంకా నీరు నిలిచిపోతున్నట్లు కౌన్సిలర్ తెలియజేశారు. దీని పై కమిషనర్ "అక్కడ ప్రధాన డ్రెయిన్ మూసుకుపోయిందని, దానిని సరిచేస్తే సమస్య తగ్గుతుందన్నారు".

**విలీన గ్రామాల సమస్యతో వేడెక్కిన సభ..**

విలీన గ్రామాల చర్చకు వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు శ్రీకారం చుట్టారు. "మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాలకు అభివృద్ధి రాలేదు. అయినప్పటికీ ఇప్పుడు తిరిగి పంచాయతీకి వెళ్లాలన్న ఆలోచన సరైంది కాదు" అని అభిప్రాయపడ్డారు.దీనిపై టీడీపీ సభ్యుడు గంగ శ్రీనివాసరావు ఎమ్మెల్యే ప్రతిపాటి పుల్లారావు సారథ్యంలో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని వివరించగా,వైసీపీ సభ్యుడు బేరింగ్ "గత పాలనలో కనీస సౌకర్యాలే లేవు" అంటూ ప్రతివాదించారు.దీంతో టీడీపీ-వైసీపీ కౌన్సిలర్ల మధ్య కాస్త వేడి వాతావరణం నెలకొంది.

**ఐదేళ్లుగా గ్రాంట్లు రాలేదని ఆవేదన.**

కౌన్సిలర్ జాలది సుబ్బారావు మాట్లాడుతూ, "గత ఐదేళ్లుగా మా వార్డుకు ఒక్క రూపాయి గ్రాంటు కూడా రాలేదు" అని ఆవేదన వ్యక్తం చేశారు. పలు సార్లు విజ్ఞప్తి చేసినా "గ్రాంట్లు లేవు" అనే సమాధానమే వస్తోందని తెలిపారు. వచ్చే రోజుల్లో తమ వార్డుకు అర్బన్ లేదా రూరల్ గ్రాంట్ల ద్వారా అయినా నిధులు కేటాయించాలని ఆయన కౌన్సిల్‌ను కోరారు.


**మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ..**

విలీన గ్రామాల నుంచి గత ఐదేళ్లుగా పన్ను వసూళ్లు జరగలేదని కమిషనర్ శ్రీహరి బాబు వెల్లడించారు.ఈ పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో ఆర్థిక సంఘం నుంచి నిధుల కేటాయింపులు నిలిపివేయబడే అవకాశం ఉందని హెచ్చరించారు.సమావేశం ముగింపు సమయంలో కౌన్సిలర్లు అడిగిన పలు అంశాలపై అధికారులు సమాధానాలు ఇస్తూ సమావేశాన్ని ముగించారు.

# ఘనంగా సర్దార్ వల్లబాయి పటేల్ 150వ జయంతి

**జయంతి సందర్భంగా టూ కే రన్ నిర్వహణ.**

**బల్లికురవ ఎస్ ఐ నాగరాజు.**



బల్లికురవ పెన్ పవర్ అక్టోబర్ 31:స్వాతంత్ర్య సమరయోధుడు, భారతదేశ తొలి ఉప ప్రధాని, ఉక్కు మనిషి సర్దార్ వల్లబాయి పటేల్ 150వ జయంతి సందర్భంగా జాతీయ ఐక్యత దినోత్సవం" గా ఏక్తా దివస్ ఉత్సవాలు బల్లికురవ మండలంలోని ఎస్ ఐ నాగరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ నాగరాజు సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గ్రామస్తులతో ఎస్ఐ నాగరాజు 2కె రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ నాగరాజు మాట్లాడుతూ భారత ప్రథమ హోంశాఖ మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని, ఆయన జయంతి రోజైన అక్టోబరు 31వ తేదీన "జాతీయ ఐక్యత దినోత్సవం"గా జరుపుకోవాలని భారత ప్రభుత్వం ప్రకటించిందని, ఇందులో భాగంగా ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశ ప్రజలను ఐక్యతా భావన వినిపించిన సర్దార్ పటేల్ ఆదర్శనీయుడని, స్వేచ్ఛా, స్వాతంత్రం ఫలాలను మనమందరం పొందుతున్నట్లు తెలిపారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ భారత హోం శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే భారతదేశంలోని 565 సంస్థానాలను భారత ప్రభుత్వంలో ఆయన విలీనం చేయడం జరిగిందనీ, ఇండియన్ సివిల్ సర్వీసెస్ ఏర్పాటు చేయుటకు నాంది పలికినట్లు తెలిపారు.జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బల్లికురవ సర్పంచ్ పందిరి అంజిబాబు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఆలయాల అభివృద్ధి బాధ్యతగా తీసుకోండి.. ఎమ్మెల్యే నసీర్ అహ్మద్..




**పెన్ పవర్, గుంటూరు, అక్టోబర్, 31**

గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ అన్నారు. శుక్రవారం స్థానిక తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయంలో ఎండోమెంట్ అధికారులతో ఎమ్మెల్యే నసీర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లాలాపేటలోని వెంకటేశ్వర స్వామి ఆలయానికి 3.6 కోట్లతో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని, దీని కోసం ప్రభుత్వానికి నివేదించామని తెలిపారు. రైలు పేటలోని ఆంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణానికి అంచనాలు రూపొందించాలన్నారు. పాత గుంటూరులోని అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో నవగ్రహ మండపం, మరుగుదొడ్లు, సీతా రామ సేవా మండలి పైకప్పు, పునాది మరమ్మతులు చేపట్టాలని సూచించారు. కృష్ణ మందిరం కోసం భూగర్భ జల పారుదల, పంపింగ్ వ్యవస్థ సరి చేయాలన్నారు. ఆలయ ఆస్తి కేసులను వేగవంతంగా పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. నూనేవారి సత్రం, సిద్ధాబత్తుని కోమలంగమ్మ, ఉదాసి మఠం ఆలయ భూమి ఆక్రమణ, టైటిల్ వివాదాలను త్వరగా పరిష్కరించాలని సూచించారు. అన్నదానం, చలివేంద్రం కార్యక్రమాలను కొనసాగించాలని, పునర్నిర్మాణ పనులలో దాతల భాగస్వామ్యం, విద్యా స్కాలర్‌షిప్‌లను ప్రోత్సహించడం చేయాలని చెప్పారు.

## సర్దార్ వల్లభాయ్ పటేల్ జీవితం ఆదర్శనియం - సి ఐ వెంకట్రావు

**పెన్ పవర్, అక్టోబర్ 31, సంతమాగులూరు**

భారతదేశ ఉక్కు మనిషిగా పేరొందిన సర్దార్ వల్లభాయ్ పటేల్ జీవితం అందరికీ ఆదర్శనీయమని సంతమాగులూరు పోలీసు సర్కిల్ సీఐ కె.వెంకట్రావు అన్నారు. శుక్రవారం వల్లభాయ్ పటేల్ 150వ జయంతి పురస్కరించుకుని రాష్ట్రీయ ఏక్తా దివస్ ను నిర్వహించారు. ముందుగా సర్ధార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పుట్టావారి పాలెం అడ్డరోడ్ నుండి అద్దంకి రోడ్డు లోని టోల్ ప్లాజా వరకు 2కె రన్ చేపట్టారు. ఈకార్యక్రమంలో ఎస్సై ఎం.పట్టాభిరామయ్య, ఏఎస్సైలు వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, కానిస్టేబుల్ బ్రహ్మయ్య, గోపీ, టోల్ ప్లాజా సిబ్బంది , తదితరులు పాల్గొన్నారు.




# మాలకొండ హుండీ ఆదాయం 1.2 కోట్లు





**వలేటివారిపాలెం, పెన్ పవర్ అక్టోబర్ 31**

మాలకొండ లో వెలిసియున్న శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి హుండీ లెక్కింపు శుక్రవారం కొండ పై కల్యాణ మండపం లో జరిగింది. ఈ లెక్కింపు ద్వారా 1,02,56,994 రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఉపకమీషనర్ మరియు ఆలయకార్యనిర్వాహనాధికారి ఎస్.చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 07-08-2025నుండి 31-10-2025కు సంబందించిన హుండీ లు తెరిచి లెక్కించ్చినట్లు తెలిపారు. హుండీ ల ద్వారా 1,02,56,994 రూపాయలు ఆదాయం వచ్చిందన్నారు.అదేవిధంగా అన్నదాన హుండీ లు ద్వారా3,63,776 రూపాయలు, బంగారం 120 గ్రాముల 90మిల్లీ గ్రాములు, వెండి 872 గ్రాముల48మిల్లీ గ్రాములు, యూ ఎస్ డాలర్స్ 8, పౌండ్స్ 125, రియాజ్,286 దిరామ్స్110 వచ్చినట్లు తెలిపారు.0 ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంనకు సహాయకమిషనర్ మరియు దేవాదాయధర్మాదాయశాఖ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పర్యవేక్షణలో భక్తులు, సేవా వారు బ్యాంకు వారి సమక్షంలో హుండీ లెక్కింపు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు, సిబ్బంది, భక్తులు,నాయి బ్రాహ్మణులు,సేవా దళం, తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ డైరెక్టరీ ఆవిష్కరించిన మాజీ మంత్రి శిద్ధా



**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు అక్టోబర్ 31**

ప్రకాశం జిల్లా; లయన్స్ ఇంటర్నేషనల్;డిస్టిక్ట్ డైరెక్టరీ లాంచ్ వేడుకలు హోటల్ ఢిల్లీ హైవే లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న పి.ఎమ్.జె.ఎఫ్, లయన్స్ మాజీ మంత్రి శిద్దా రాఘవ రావు డైరెక్టరీని ఆవిష్కరించి తొలి ప్రతిని లయన్స్ క్లబ్ డిస్టిక్ట్ గవర్నర్ సి.హెచ్. హరి ప్రసాద రావు కు అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్ నామినేని మోహన్ రావు, లయన్ అంబటి సుధాకర్ రెడ్డి, లయన్ గోపాలరావు,లయన్ రావిపూడి లక్ష్మి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# మార్కెట్ యార్డ్ కమిషనర్‌ను కలిసిన ఏఎంసి మాలపాటి



**మార్కాపురం ఆర్.సి ఇన్చార్జి పెన్ పవర్ అక్టోబర్ 31**

స్థానిక మార్కెట్ యార్డ్, రైతు బజార్ ల అభివృద్ధి కోసం వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిషనర్ ను మర్యాదపూర్వకంగా ఏఎంసీ చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి కలిశారు. ఈ సందర్భంగా మార్కాపురంలో పలు సమస్యల గురించి ఆమె దృష్టికి తీసుకెళ్లారు. రైతు బజార్ లలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రహరీ నిర్మాణం వంటి సమస్యలను ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. త్వరలోనే వాటి సమస్య పరిష్కరిస్తానని మార్కాపురం ఏఎంసి చేర్మెన్ వెంకటరెడ్డికి ఆమె భరోసా ఇచ్చారు. తమకోసం కమిషనర్ కలవడంతో రైతులు ఆనందించారు. స్థానిక ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సూచనల మేరకు కమిషనర్ ను కలవడం జరిగిందని, త్వరలోనే మార్కాపురం మార్కెట్ యార్డ్ సంబంధించిన సమస్యలను పరిష్కరిస్తానని వెంకటరెడ్డి కి ఆమె హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదిక

## ప్రజా దర్బార్‌లో సమస్యలు వినిపించిన బాధితుల - స్పందించిన ఎమ్మెల్యే చదలవాడ

## 150 యానాదుల కుటుంబాలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలంటూ కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే

## ప్రజల సమస్యలకు తక్షణ స్పందనతో ముందుకెళ్తున్న డాక్టర్ చదలవాడ అరవింద బాబు







**నరసరావుపేట పెన్ పవర్ ప్రతినిధి అక్టోబర్ 31**

నరసరావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ, వినూత్న రీతిలో ప్రజలతో మమేకమవుతున్నారు. ప్రతిరోజూ ప్రజల సమస్యలు పరిష్కరించడంలో చురుకుగా పాల్గొంటూ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నారు. శుక్రవారం నాడు నరసరావుపేట టిడిపి కార్యాలయంలో ఆయన ప్రజా దర్బార్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ కార్యాలయాల్లో జరిగే ప్రజా వేదికల మాదిరిగానే ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. సమస్య చెప్పగానే పరిష్కారం లభిస్తుందన్న నమ్మకంతో ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా కోటప్పకొండ పరిసర ప్రాంతాలకు చెందిన 150 యానాదుల కుటుంబాలు తమకు గృహ స్థలాలు ఇవ్వాలంటూ ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. ముప్పై సంవత్సరాలుగా ప్రభుత్వ స్థలంలో గుడిసెల్లో నివసిస్తూ, ఇటీవల మోతా తుఫాన్ కారణంగా గాలివానలతో గుడిసెలు దెబ్బతినడంతో నిరాశ్రయులయ్యారని వారు వివరించారు. వారి పరిస్థితిని గమనించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు వెంటనే స్పందించి, బాధితులను వెంటబెట్టుకుని నేరుగా జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లారు. కలెక్టర్‌ను కలిసి, యానాదులకు తగిన న్యాయం చేయాలని, నివాస సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ స్పందిస్తూ, ప్రభుత్వంతో చర్చించి వీరికి తగిన సాయం అందిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో కోటప్పకొండ టిడిపి ఇన్‌చార్జి లింగాల వీరప్పయ్య సహకరించారు. ప్రజా దర్బార్‌లో వచ్చిన ఇతర సమస్యలను కూడా ఎమ్మెల్యే వెంటనే స్వీకరించి, సంబంధిత అధికారులను సంప్రదించి పరిష్కరించాలంటూ ఆదేశించారు. ప్రజల సమస్యలకు తక్షణ స్పందన, నేరుగా అధికారులను సంప్రదించి పరిష్కార మార్గం చూపడం ద్వారా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మరోసారి తన నాయకత్వాన్ని నిరూపించారు. నియోజకవర్గ ప్రజల్లో ఆయన పట్ల విశ్వాసం, మద్దతు మరింతగా పెరుగుతోంది. సమస్యల కోసం వచ్చిన యానాది కుటుంబాలు కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

# పోలీస్ అమరవీరుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ క్యాండిల్ ర్యాలీ నిర్వహించిన.. పోలీసులు





**పెన్ పవర్, గుంటూరు, అక్టోబర్, 31**

గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ(ఏఆర్) ఏ.హనుమంతు ఆధ్వర్యంలో పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా పోలీస్ అమర వీరులను స్మరించుకుంటూ ఈరోజు(31.10.2025) రాత్రి జిల్లా పోలీస్ కార్యాలయం నుండి నగరం పాలెం బ్యాంక్ కూడలి వద్ద పోలీస్ అమరవీరుల స్థూపం వరకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ హనుమంతు మాట్లాడుతూ... దేశం కోసం ప్రాణాలను అర్పించిన పోలీసు అమరవీరులను స్మరించుకోవడం మనందరి కర్తవ్యమని" పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం అక్టోబర్ 21 నుండి 31 వరకు నిర్వహించే పోలీస్ అమరవీరుల వారోత్సవాలు మన పోలీస్ శాఖ యొక్క అంకితభావం, నిబద్ధత, త్యాగాలకు గుర్తుకు చేసుకునేందుకు నిదర్శనమని తెలిపారు. ఈ వారోత్సవాల్లో భాగంగా గుంటూరు జిల్లా అంతటా వివిధ కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. అమరవీరులు చూపిన ధైర్యం, త్యాగం, సేవలు మనందరికీ ప్రేరణగా నిలుస్తాయని, వారు విధి నిర్వాహణలో చూపిన ధైర్యసాహసాలు భవిష్యత్ తరాలకు ఆదర్శప్రాయమని ప్రతి ఒక్కరూ ఆ ఆదర్శాలను అనుసరించాలని ఆయన సూచించారు. జిల్లా వ్యాప్తంగా జరిగిన ఈ వారోత్సవాల్లో పోలీసు కుటుంబాలతో సమావేశాలు, విద్యార్థుల కోసం వ్యాసరచన, వక్తృత్వ పోటీలు,చిత్ర లేఖన పోటీలు, అమరవీరుల స్మారక స్థూపాల వద్ద పూలమాలలు వేసి నివాళులు అర్పించడం వంటి అనేక కార్యక్రమాలు నిర్వహించామని వివరించారు. మన సమాజం సురక్షితంగా, శాంతియుతంగా ఉండటానికి ప్రాణాలను పణంగా పెట్టిన పోలీసు అమరవీరుల త్యాగం ఎప్పటికీ మరవలేనిది. వారిని స్మరించుకోవడం ద్వారా వారి కుటుంబాలకు మద్దతు ఇవ్వడమే కాక, పోలీస్ వ్యవస్థ పట్ల ప్రజల్లో విశ్వాసం మరింత పెంపొందుతుంది" అని ప్రతి ఒక్కరూ దేశభక్తిని మనసులో నింపుకొని అమరవీరుల స్ఫూర్తితో సేవా మార్గంలో కొనసాగాలని పిలుపునిచ్చారు. ఈ ర్యాలీలో పోలీస్ అధికారులు, సిబ్బంది, పోలీస్ అమర వీరుల కుటుంబ సభ్యులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొని అమరుల స్ఫూర్తిని స్మరించి, అమరవీరుల స్థూపం వద్ద కోవ్వొత్తులు వెలిగించి, పుష్పాలతో ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ తో పాటు డీఎస్పీలు బెల్లం శ్రీనివాస్ , అబ్దుల్ అజీజ్, అరవింద్ , సీఐ అలహరి శ్రీనివాస్ , కొత్తపేట సీఐ వీరయ్య చౌదరి, నగరం పాలెం సీఐ సత్యనారాయణ , ట్రాఫిక్ సీఐలు అశోక్, సింగయ్య , ఆర్ఐలు శ్రీహరి రెడ్డి, సురేష్ , ఎస్సైలు, ఆర్ ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# బోనబోయిన కౌశిక్ ఘనంగా జన్మదిన వేడుకలు

**- బోనబోయిన అభిమానులు**



**పెన్ పవర్,గుంటూరు, అక్టోబర్ 31**

జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరియు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఇంచార్జి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ చిన్న కుమారుడు యువనాయకులు బోనబోయిన కౌశిక్ కృష్ణ జన్మదిన వేడుకలు గుంటూరు జిల్లా పార్టీ కార్యాలయంలో మరియు అమరావతి రోడ్డు నగరాలలో గల బీవీఆర్ కన్వెన్షన్ వద్ద ఘనంగా జరిగాయి. ఈ జన్మదిన వేడుకల కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు , జిల్లా కార్యవర్గ సభ్యులు, జనసేన నగర కార్పొరేటర్ లు, వార్డు ప్రెసిడెంట్లు, కూటమి నాయకులు తట్టుకోళ్ళ కేశవయ్య మరియు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గాదే వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మా యువ నాయకులు బోనబోయిన కౌశిక్ కృష్ణ వారి నాన్న గారి లానే అందరితో కలివిడిగా ఉంటూ మా పార్టీ యువ నాయకులు భవిష్యత్ లో ప్రజలు మెచ్చే నాయకుడిగా ఎదగాలని, ప్రజాసేవలో తండ్రిని మించిన తనయుడిగా పేరు పొందాలి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బోనబోయిన అభిమానులు మరియు శ్రేయోభిలాషులు భారీ గా పాల్గొని విజయంతో చేసినారు.

# విభజించు-పాలించు అనే విధంగా అధికారుల ధోరణి - ఎమ్మెల్యే గళ్ళా మాధవి

**పెన్ పవర్, గుంటూరు, అక్టోబర్ 31**

గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో తనకు తెలియకుండా కార్యక్రమం నిర్వహించటం, ప్రోటోకాల్ పాటించకపోవటం ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి గుంటూరులో విభజించు పాలించు అనే విధంగా అధికారుల ధోరణి ఉందని, నియోజకవర్గములో ఉన్న ప్రజా ప్రతినిధుల మధ్య అంతర్గత విభేదాలు వచ్చే విధంగా అధికారులు రాజకీయం చేస్తున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి గారు మాట్లాడుతూ గత మూడు రోజులుగా సైక్లోన్ ప్రభావిత ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం దిశా నిర్దేశాల మేరకు అత్యవసర సరుకుల పంపిణీ జరిగింది. గుంటూరు పశ్చిమలో కూడా ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేసి మా ద్వారా పంపిణీ కార్యక్రమం నిర్వహించాము. కానీ అదే సమయంలో అధికారులు మరో చోట వేరే కార్యక్రమం నిర్వహించడం, ఆ కార్యక్రమానికి కనీస సమాచారం ఇవ్వకపోవటం ఏంటని ఎమ్మెల్యే గళ్ళా మాధవి మండిపడ్డారు. అసలు అధికారులు రెండు విడివిడిగా కార్యక్రమాలు అవసరమా మేయర్ , కమిషనర్ ఒక వైపు కార్యక్రమం చేసి మాకు కనీసం సమాచారం కూడా ఇవ్వలేదు. నేను పాల్గొన్న పంపిణీ కేంద్రంలో వారు లేరు, కానీ నాకు తెలియకుండా వారు నా నియోజకవర్గములో కనీస మర్యాద పాటించకుండా కార్యక్రమం నిర్వహించటం నాకు చాలా బాధ కలిగించిందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆవేదన వ్యక్తం చేశారు. అసలు ప్రోటోకాల్ ఎక్కడ బ్యానర్లలో ప్రజాప్రతినిధులు ఎందుకు లేరు మేయర్ , కమిషనర్ నిర్వహించిన కార్యక్రమ బ్యానర్‌లో స్థానిక ఎమ్మెల్యే గాని, ఎంపీ గాని ఫోటోలు లేవు. అలాగే తాను పంపిణీ చేసిన చోట మోడీ,



మేయర్ ఫోటోలు లేవు. అంటే అధికారులు కనీస ప్రోటోకాల్ కూడా పాటించకపోవడం తీవ్రంగా ఆవేదన కలిగిస్తోంది,అని వ్యాఖ్యానించారు. ఇది అమాయకత్వమా, అవివేకమా, లేక అహంకారమా, ఈ విభజించు-పాలించు విధానం ఎందుకు ఎవరు ఈ ప్లాన్ చేశారు రెండు ప్రోగ్రాములు ఎందుకు జరిగాయి ఇది గవర్నమెంట్ కార్యక్రమం కదా అందరూ కలిసికట్టుగా చేయాల్సినది. ఇలాంటి చర్యల వెనుక ఉన్న ఉద్దేశం ఏమిటి అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఫోటో లేకుండా కార్యక్రమాలు ఎందుకు గతంలో మెప్మా విభాగం నిర్వహించిన కార్యక్రమాల్లో చంద్రబాబు నాయుడు , ప్రధాని నరేంద్ర మోడీ,ఫోటోలు లేకుండా నిర్వహించడం కూడా గళ్ళా మాధవి ప్రస్తావించారు. హడావిడి అయిపోయిందని చెప్పడం సరైన సమాధానం కాదు. నాయకులను మర్చిపోయే స్థితి ఎందుకు వచ్చింది అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రశ్నించారు. అధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం లేకుంటే రాష్ట్రం ముందుకు వెళ్లదు. ప్రజలు ఓటు వేసి ప్రతినిధులను ఎన్నుకుంటారు, ప్రజల పన్నులతో జీతాలు పొందే అధికారులు కూడా అదే ప్రజల సేవలో ఉండాలి. ఈ సమన్వయమే అభివృద్ధికి మూలం,అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్పష్టం చేశారు. 24వ డివిజన్ ప్రోగ్రామ్ గురించి నాకు తెలియదు. నిన్న సాయంత్రం సోషల్ మీడియాలో చూసే వరకు గుంటూరు పశ్చిమ నియోజకవర్గము 24వ డివిజన్‌లో వేరే కార్యక్రమం జరిగిన విషయం నాకు తెలియలేదు. ఇది నాకు నిజంగా ఆశ్చర్యం కలిగించింది. ఈ పరిస్థితి ఎందుకు వచ్చింది ఎవరు కారణం దానికి సమాధానం రావాలి,అని గళ్ళా మాధవి అన్నారు. అధికారులు సమాధానం ఇవ్వాలి. అధికారులకు నేను ప్రశ్న వేసాను, ఆన్సర్ ఇవ్వాల్సింది అధికారులు. ఇది అమాయకత్వమా, లేక ఇంకా కూటమి ప్రభుత్వాన్ని అంగీకరించట్లేదా అన్నది వారే చెప్పాలి. అందుకే ఈ మీడియా సమావేశం ఏర్పాటు చేశాను,అని గళ్ళా మాధవి స్పష్టం చేశారు.

**ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు నిబద్ధత చూపాలి..:** గుంటూరు పశ్చిమలో ఎన్నో సమస్యలు పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నాయని, తాను పదేపదే కౌన్సిల్ సమావేశాల్లో అడిగాను. వర్క్స్ ప్రాధాన్య క్రమంలో చేయండి. ప్రజలు ఇబ్బంది పడుతున్న ప్రాంతాలను ముందు దృష్టిలో పెట్టండి. కానీ కొన్నింటిపై మాత్రమే దృష్టి పెడుతున్నారు, మిగతావి విస్మరిస్తున్నారు. ఇది మారాలి, అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్పష్టం చేశారు.

**సమన్వయం ఉంటేనే అభివృద్ధి సాధ్యం::** కాంట్రాక్టర్లు, అధికారులు ఒకరిపై ఒకరు నెపం వేయడం కాకుండా కలిసి పనిచేయాలి. ప్రజల కోసం మనం ఉన్నాము అది గుర్తు పెట్టుకోవాలి, అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు.

## జగన్ నేతలకు అల్టిమేటం జారీ చేశారా



**విజయవాడ, అక్టోబరు 31, పెన్ పవర్:** :వైసీపీ అధినేత జగన్ పార్టీనేతలపై పెద్దగా దృష్టి పెట్టడం లేదనిపిస్తుంది. ఎవరికి వారే నిర్ణయాలు ప్రకటించడం ఇప్పుడు పార్టీలోనే కాదు రాజకీయంగా కూడా చర్చనీయాంశమైంది. ప్రాంతీయ పార్టీ అంటే అధినేత ఆలోచనలను పసిగట్టి నేతలు మసులుకోవాల్సి ఉంటుంది. అయితే కొందరు నేతలు కట్టు తప్పుతున్నారని పార్టీ వర్గాలే అభిప్రాయపడుతున్నాయి. జగన్ ఆలోచనల ప్రకారం నేతలు నడుచుకోవడం లేదనడానికి ఇటీవల జరిగిన అనేక ఘటనలు ఇందుకు ఉదాహరణగా చూపుతున్నారు. జగన్ ఆంధ్రప్రదేశ్ కు దూరంగా ఉండటంతో పాటు నేతలతో తరచూ సమావేశాలు కాకపోవడం వల్లనే ఈ రకమైన ఇబ్బందులు పార్టీలో తలెత్తుతున్నాయన్నది వాస్తవం. అందుకే ఆయన కనిపించరట 2019 ఎన్నికలకు ముందు... 2019 ఎన్నికలకు ముందు.. ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జగన్ మాట వేదవాక్కుగా నడిచేది. ఏ నిర్ణయమైనా అంతసులువుగా బయటకు చెప్పే వారు కాదు. కేవలం సజ్జల రామకృష్ణారెడ్డి మాత్రమే జగన్ తో మాట్లాడి వచ్చిన తర్వాత పార్టీ, ప్రభుత్వ ఆలోచనను ప్రజల ముందుంచేవారు. ఇక 2019 ఎన్నికల్లో పూర్తిగా జగన్ ఫొటోతోనే గెలిచామన్న భావనలో ఉన్న నేతలు పార్టీ నిర్ణయాలను తప్పుపట్టే సాహసం చేసేవారు కాదు. అందులో నిజం ఉందని చాలా మంది బహిరంగంగా అంగీకరించేందుకు కూడా మొహమాట పడేవారు కాదు. కాని ఎప్పుడైతే జగన్ అధికారానికి దూరమయ్యారో అప్పటి నుంచి అధినేతను కూడా లెక్క చేయని పరిస్థితి నేతల్లో కనిపించడం పార్టీ నాయకత్వంలో ఆందోళన కలిగిస్తుంది. అమరావతి రాజధాని విషయంలోనూ అదే జరిగింది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు మూడు రాజధానులను జగన్ స్వయంగా అసెంబ్లీలో ప్రకటించారు. గత ఎన్నికల్లో అదే నినాదంతో వెళ్లారు. కానీ ప్రజలు ఆదరించలేదు. అయితే ఓటమి తర్వాత అమరావతిని రాజధానిగానే ఉంచుతామని ఇప్పుడు చెబుతున్నారు. మాజీ మంత్రి జోగి రమేష్ కూడా అమరావతి విషయంలో తమ పార్టీ నిర్ణయం తప్పేనని అంగీకరించడం చర్చ జరుగుతోంది. ఇక విశాఖకు గూగుల్ డేటా సెంటర్ విషయంలోనూ తొందరపడి ప్రభుత్వంపై విమర్శలు చేశారు. కానీ జగన్ మాత్రం గూగుల్ సెంటర్ ఏపీకి రావడం మంచిదేదని చెప్పారు. అలాగే ఇప్పుడు విపత్తుల సమయంలోనూ ఎలాంటి ప్రకటనలు ఎవరూ చేయవద్దని, జగన్ మాత్రమే ప్రకటిస్తారని పార్టీ నాయకత్వం నేతలకు అల్టిమేటం ఇచ్చినట్లు తెలిసింది. మరి నేతలు నాయకత్వం మాటలు విని మౌనంగా ఉంటారా? లేదా? అన్నది చూడాలి.

## అన్న బాటలోనే షర్మిల...



**విజయవాడ, అక్టోబరు 31, పెన్ పవర్:**ఏపీలో రాజకీయాలు చాలా విచిత్రంగా నడుస్తున్నాయి. ఒకవైపు అధికారంలో ఉన్న కూటమి ప్రతిదాన్నీ వీలైనంత ఎక్కువ ప్రచారం చేస్తూ అనుక్షణం ప్రజల నాలుకలపై ఉండడానికి ప్రయత్నిస్తుంటే మరువైపు ప్రతిపక్ష పార్టీల అధినేతలు ఎక్కడో వెనకడుగు వేస్తున్నారు అనే అభిప్రాయం చాలా మందిలో ఉంది. దానికి తగ్గట్టే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కీలక సమయాల్లో ఏపీలో ఉండటం లేదన్న అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వ్యక్తం అవుతుంటే ఇప్పుడాయన చెల్లెలు, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కూడా అదే బాటలో ఉంటున్నారు. రాజకీయాల్లో ఇది సరైన స్ట్రాటజీ కాదని నిపుణులు అంటున్నారు.2019 ఎన్నికలకు ముందు తాను "అమరావతిలోనే సొంత ఇల్లు కట్టుకున్నానని చంద్రబాబు ఆ సాహసం చేయడం లేదని" పదేపదే చెప్పుకున్న జగన్మోహన్ రెడ్డి 2024లో పార్టీ ఓడిపోయాక వీలైనంత ఎక్కువ సమయం బెంగుళూరులోనే ఉంటున్నారనే అభిప్రాయం సొంత పార్టీ నేతల నుంచే వ్యక్తం అవుతోంది. నేతలు ముఖ్యమైన విషయాలు ఆయనతో చర్చించాల్సిన అవసరం వచ్చినా లేక రాష్ట్రంలో ఏదైనా అవాంతరం వచ్చినా వెంటనే రియాక్ట్ అవ్వాల్సిన సమయాల్లో బెంగళూరులో ఉన్న జగన్మోహన్ రెడ్డి తాడేపల్లికి వచ్చే వరకు వాళ్లు వెయిట్ చేయాల్సి వస్తోంది. నిన్న మొన్నటి తుపాన్ సమయంలో కూడా అయన బెంగళూరులోనే ఉన్నారు. విజయవాడకు రావాల్సి ఉన్నా విమానాలు క్యాన్సిల్ కావడంతో ఆయన రాలేకపోయారు. దీన్ని ఆయన రాజకీయ ప్రత్యర్థులు విమర్శిస్తున్నారు. దీనివల్ల జగన్మోహన్ రెడ్డి ప్రజలకు, పార్టీ నేతలకు అందుబాటులో ఉండటం లేదని అభిప్రాయం ఎక్కువగా ప్రచారం అవుతోంది.

రాజకీయంగా అన్నతో విభేధించి సొంత దారిలో వెళుతున్న షర్మిల నివాసం విషయంలో మాత్రం అన్న బాటలోనే వెళుతోందన్న అభిప్రాయం జనాల్లో ఉంది. నిజానికి ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలుగా ఉన్న ఆమెకు సొంత పార్టీ నుంచే చాలా విమర్శలు వస్తున్నాయి. పార్టీలో అసమ్మతిని సానుకూలం చేసుకోవాల్సిన అవసరం ఆమెకు ఉంది. తుపాను లాంటి విపత్కర పరిస్థితుల్లో అధికారంలో ఉన్నా లేకపోయినా రాజకీయ పార్టీల అధినేతలు ప్రజలకు నేతలకు అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉంది. దానివల్ల క్షేత్రస్థాయిలో పార్టీ నేతలకు ఒక భరోసా ఉండడంతోపాటు

సమన్వయంతో పని చేసే అవకాశం ఉంటుంది. కానీ షర్మిల వీలైనంత ఎక్కువగా హైదరాబాదులో ఉండడానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. విజయవాడ సమీపంలో ఇల్లు కొన్నారన్న ప్రచారం జరిగినా ఆమె ఇంతవరకు అక్కడకు వెళ్ళింది లేదు. ఆమె కుటుంబ వ్యవహారాల రీత్యా ఎక్కువగా విదేశాల్లో ఉన్న పిల్లల దగ్గరకు వెళుతున్నారు. మరోవైపు వైఎస్ రాజశేఖర్ రెడ్డి వారసుడిగా తన కుమారుడిని ప్రొజెక్ట్ చేసే ప్రయత్నాలూ చేస్తున్నారు. ఇలాంటి కీలక బాధ్యతలు ఎత్తుకున్న షర్మిల తాను ఆంధ్రప్రదేశ్‌లో ఉండాల్సిన అవసరం చాలా ఎక్కువగా ఉంది. కానీ ఎందుకో మరి ఆమె ఇక్కడ నివాసం ఉండడం లేదు. ఇది రాజకీయంగా చాలా రాంగ్ స్ట్రేటజీ అని

విశ్లేషకులు చెప్తున్నారు. ఇలాంటి విషయాల్లో కూటమి చాలా వేగంగా దూసుకుపోతోంది. అది తుపాను అయినా వరదైనా ప్రచారంలో మాత్రం ఏ లోటూ రానీయదు. కొన్నిసార్లు ఈ ప్రచారం ఒక హద్దు దాటిందని, అతివృష్టి చేస్తున్నారని ట్రోల్స్ వస్తున్నా అనుక్షణం ప్రజల దృష్టిలో ఉండడానికి కూటమి ప్రయత్నిస్తోంది. ఈ ప్రచారంతో పోటీ పడడం మాట ఎలా ఉన్నా ముందు సొంత పార్టీ నేతలకు అందుబాటులో ఉండడానికి %హ% జగన్, షర్మిల లాంటి నేతలు స్థానికంగా ఎక్కువగా ఉండడానికి ప్రాధాన్యత ఇస్తే బాగుంటుందని అనువజ్ఞులు చెబుతున్నారు. కమ్యూనిస్టు నేతలు కూడా ఇప్పటికే వరద ప్రాంతాల్లో పర్యటించి వచ్చిన పరిస్థితుల్లో దివంగత ముఖ్యమంత్రి పిల్లలు, రెండు వేరు వేరు పార్టీలకు అధినేతలు ఇలాంటి విషయాల్లో వెనుక పడడం రాంగ్ స్ట్రాటజీ అనే అభిప్రాయం చాలా మందిలో ఉన్న మాట వాస్తవం. మరి ఇప్పటికైనా జగన్, షర్మిల ఆ దిశగా ఆలోచిస్తారేమో చూడాలి.

# లోకేష్ పేరును వదలని సైబర్ చీటర్స్



**విజయవాడ, అక్టోబరు 31, పెన్ పవర్:**
సైబర్ నేరాల తీరు మారుతోంది. ఇప్పటివరకు సామాన్యులే టార్గెట్ అయ్యేవారు. ఇప్పుడు సెలబ్రిటీలను సైతం వదలడం లేదు. వీఐపీల పేర్లు, ఫోటోలు వాడుకొని సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు. మొన్న మధ్యన రాయలసీమ జిల్లాకు చెందిన టిడిపి ఎమ్మెల్యే ఒకరిని టార్గెట్ చేసి కోటి రూపాయలకు పైగా వసూలు చేసినట్లు వార్తలు వచ్చాయి. తాజాగా ఏపీ మంత్రి నారా లోకేష్ పేరుతో 57 లక్షల రూపాయలు కొల్లగొట్టేశారు. దీంతో రంగంలోకి దిగిన ఏపీ పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఇది సంచలన అంశంగా మారింది. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి.ఏపీకి చెందిన ఓ వ్యాపారికి.. మంత్రి నారా లోకేష్ ప్రొఫైల్ పిక్చర్ గా ఉన్న ఓ వాట్సప్ నుంచి సమాచారం వచ్చింది. కీలకమైన ప్రాజెక్టులకు డబ్బు అవసరం ఉందని చెప్పి.. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ద్వారా ఫోన్ కాల్ చేసి అచ్చంగా మంత్రిగా మాట్లాడారు. అయితే అది నిజమేనని భావించిన సదరు వ్యాపారి పలు విడతల్లో 57 లక్షల రూపాయల వరకు అలా బెదిరించిన వ్యక్తులకు పంపించాడు. చివరకు ఇది మోసంగా భావించి ఏపీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు రంగంలోకి దిగి ప్రధాన నిందితుడు రాజేష్ ను అదుపులోకి తీసుకున్నారు. ఆయన ఇచ్చిన సమాచారంతో హైదరాబాదులో సాయి శ్రీనాథ్, సుమంత్ అనే ఇద్దరు వ్యక్తులను హైదరాబాదులో అరెస్టు చేశారు. ఈ ఘటన వెనుక పెద్ద ముఠా హస్తం ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రధానంగా ప్రముఖులు, రాజకీయ పార్టీల నేతలను టార్గెట్ చేస్తున్నట్లు స్పష్టం అవుతుంది.కొద్ది రోజుల కిందట ఖమ్మం జిల్లా టిడిపి నేతలను ఇలానే సైబర్ నేరగాళ్లు దోచుకున్నారు. మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పేరుతో వాట్సాప్ కాల్ చేశారు. తెలంగాణలో పార్టీ అభివృద్ధికి నిధులు కావాలని.. అందుకు విరాళాలు అందించాలని కోరడంతో కొందరు నేతలు నగదు పంపించారు. అదే సమయంలో తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతున్నాయి. ఆ ఎన్నికల్లో బీఫారాలు కావాలంటే కొంత మొత్తం చెల్లించాలని కోరడంతో.. రెండోసారి కూడా సదరు నేతలు నగదు జమ చేశారు. అమరావతి వస్తే పార్టీ అధినేత చంద్రబాబుతో బీఫారాలు ఇప్పిస్తామని నమ్మబలికారు. విజయవాడలో వారి పేరుతో హొటళ్లు కూడా బుక్ చేశారు. దీంతో ఇది నిజమని నమ్మిన నేతలు విజయవాడ వెళ్లి హొటల్లో దిగారు. అయితే అక్కడ బిల్లు చెల్లించే క్రమంలో వివాదం జరిగింది. తాము సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడ్డామని గుర్తించిన సదరు నేతలు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెనుకడుగు వేశారు. బయటకు చెబితే పరువు పోతుందని భావించారు. ఇంకోవైపు రాయలసీమ జిల్లాకు చెందిన టిడిపి ఎమ్మెల్యే ఒకరు హైదరాబాదులో ఇలానే సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడ్డారు. అయితే ఇప్పుడు మంత్రి నారా లోకేష్ పేరు చెప్పి సైబర్ నేరానికి పాల్పడడంతో పోలీసులు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. అందుకే కేసును ఛేదించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

# సత్యసాయి శత జయంతి వేడుకలు..

### ప్రభుత్వం నిర్వహిస్తే తప్పేంటి.. హైకోర్టు వార్నింగ్

**అనంతపురం, అక్టోబరు 31, పెన్ పవర్:**
పుట్టపర్తి శ్రీ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలను రాష్ట్ర వేడుకగా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. దీన్ని వ్యతిరేకిస్తూ ఏపీ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. లౌకిక దేశంలో మతపరమైన వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడంపై పటిషనర్ అభ్యంతరం తెలిపారు. అయితే సత్యసాయి ట్రస్ట్ చేసిన ప్రజా సేవలను పరిగణనలోకి తీసుకుని గౌరవించడంలో తప్పేముందని సూటిగా ప్రశ్నించింది. పిటిషన్‌ను వెనక్కి తీసుకోవాలని లేదంటే ఖర్చులు విధిస్తూ.. వ్యాజ్యాన్ని కొట్టివేస్తామని వార్నింగ్ ఇచ్చింది
పుట్టపర్తి శ్రీ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. నవంబరు 23న జరిగే ఈ వేడుకలకు హాజరు కావాలని.. ఇప్పటికే ప్రధాని మోదీ, తెలుగు రాష్ట్రాలతోపాటు వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉపముఖ్యమంత్రులు, మంత్రులకు.. శ్రీ సత్యసాయి ట్రస్ట్ సభ్యులు ఆహ్వానాలు అందజేశారు. ఈ మేరకు ప్రధాని మోదీ కూడా హాజరు కానున్నారు. అయితే ఈ ఉత్సవాలను రాష్ట్ర వేడుకగా నిర్వహించడంపై ప్రకాశం జిల్లా ఒంగోలుకు చెందిన భారత హేతువాద సంఘం అధ్యక్షుడు వెంకట సుబ్బయ్య అభ్యంతరం వ్యక్తం చేశారు. దీన్ని ఆపాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్) దాఖలు చేశారు. ప్రభుత్వ నిధులను ఇలా మతపరమైన కార్యక్రమాలకు మళ్లించడానికి వీలు లేదంటూ ఆ పిటిషన్‌లో అభ్యంతరం తెలిపారు. దీనిపై బుధవారం విచారణ చేపట్టిన హైకోర్టు పటిషనర్‌కు వార్నింగ్ ఇచ్చింది.సత్యసాయి శతజయంతి ఉత్సవాలను రాష్ట్రప్రభుత్వం అధికారిక వేడుకగా నిర్వహిస్తే తప్పేముందని భారత హేతువాద సంఘాన్ని హైకోర్టు సూటిగా ప్రశ్నించింది. సత్యసాయి ట్రస్ట్ ద్వారా మూడు జిల్లాలకు తాగునీరు అందించారని.. ఈ విషయం రాష్ట్రానికి వచ్చిన కొత్తలో తన సహచరుల ద్వారా తనకు తెలిసిందని జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ అన్నారు. అంతే కాకుండా ఆసుపత్రులు, విద్యాసంస్థలు సైతం స్థాపించి ప్రజలకు సేవ చేస్తున్నారని పిటిషనర్‌కు ఈ సందర్భంగా హైకోర్టు గుర్తుచేసింది. ఇలాంటి విశిష్ట వ్యక్తులను గౌరవించడంలో తప్పేముందంటూ వెంకట సుబ్బయ్యను సూటిగా ప్రశ్నించింది. తాను దాఖలు చేసిన పిల్‌ను వెంకట సుబ్బయ్య వెనక్కి తీసుకోవాలని ఆదేశించింది. లేకుంటే ఖర్చులు విధించి పిల్ కొట్టేస్తామని వార్నింగ్ ఇచ్చింది. నిజంగా ప్రజా ప్రయోజనం ఉన్న వ్యాజ్యాలపై దృష్టి సారించాలని హితవు పలికింది.విచారణ సందర్భంగా భారత హేతువాద సంఘం తరపున వాదించిన న్యాయవాది జడ శ్రావణ్‌కుమార్.. లౌకిక రాజ్యంలో మతపరమైన కార్యక్రమానికి ప్రభుత్వ నిధులు వినియోగించడానికి వీలు లేదన్నారు. దీనికి ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) ఎస్ ప్రణతి కౌంటర్ వాదనలు వినిపించారు. వివిధరకాలుగా ప్రజా సేవ చేసిన 22 మంది వ్యక్తుల జయంతిని అధికారికంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని కోర్టుకు నివేదించారు. సత్యసాయి నెలకొల్పిన ట్రస్ట్ ద్వారా రాష్ట్రంలో పలు సామాజిక సేవలు అందుతున్నాయని వెల్లడించారు. శ్రీసత్యసాయి సేవలను పరిగణనలోకి తీసుకొని జయంతిని అధికారికంగా నిర్వహించడానికి ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. దీనిపై స్పందించిన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్.. సరైన అధ్యయనం చేయకుండా ప్రభుత్వం ఉత్తర్వులు ఎలా జారీ చేస్తుందని పిటిషనర్‌ను ప్రశ్నించారు.

# పాత జిల్లాలోనే కలిపేయండి

**కర్నూలు, అక్టోబరు 31, పెన్ పవర్:**
ఏపీలో జిల్లాల పునర్విభజన వేళ డోన్ నియోజకవర్గ ప్రజలు తమను నంద్యాల నుంచి కర్నూలు జిల్లాలో కలపాలని కోరుతున్నారు. వైద్య, ఉపాధి అవసరాలకు కర్నూలు దగ్గరగా ఉండటమే దీనికి కారణం. గతంలోనూ కర్నూలు జిల్లాలోనే ఉన్న డోన్ వాసులు, ఈ మార్పు తమకు సౌకర్యంగా ఉంటుందని చెబుతున్నారు. డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి కూడా ఈ దిశగా ప్రయత్నాలు చేస్తున్నారు.ఏపీలో కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, జిల్లాల పునర్విభజన, మండలాల పునర్విభజనలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో తాజాగా మరో డిమాండ్ తెరపైకి వచ్చింది. తమను నంద్యాల జిల్లా నుంచి తీసుకెళ్లి కర్నూలు జిల్లాలో కలిపేయాలని డోన్ నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు. డోన్ నియోజకవర్గం నంద్యాల జిల్లాలో కలపడాన్ని అక్కడి ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. గతంలో డోన్ నియోజకవర్గం కర్నూలు జిల్లాలోనే ఉండేది. దీంతో డోన్ వాసులు చిన్న అనారోగ్య సమస్యలు వచ్చినా, అత్యవసర పరిస్థితులు ఎదురైనా కర్నూలులోని పెద్దాసుపత్రికి వెళ్లేవారు. ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, నిరుద్యోగులు, కూలీలు కూడా ఉపాధి, ఉద్యోగాల కోసం కర్నూలుకు వెళ్లేవారు. అయితే గత ప్రభుత్వ హయాంలో నంద్యాల జిల్లాలోకి విలీనం అయింది. ఈ మార్పును వ్యతిరేకిస్తూ అప్పట్లోనే ప్రజలు అనేక విజ్ఞప్తులు చేశారు.డోన్ నియోజకవర్గ ప్రజలు తమ ప్రాంతాన్ని కర్నూలు జిల్లాలోనే కొనసాగించాలని కోరుతున్నారు. 2 లక్షలకు పైగా ఓటర్లున్న ఈ నియోజకవర్గంలో, డోన్ పట్టణ, మండలాల నుంచి 90 వేలకు పైగా ఓటర్లు ఉన్నారు. చారిత్రాత్మకంగా, డోన్ ప్రాంతం నుంచి ఎన్నికైనవారు రాష్ట్ర, కేంద్ర మంత్రి పదవులు కూడా చేపట్టారు. ప్రస్తుతం, డోన్‌ను కర్నూలు జిల్లాలో కొనసాగించాలని కోరుతున్నారు. డోన్ నుంచి కర్నూలుకు హైవే మార్గంలో కేవలం 50 కిలోమీటర్ల దూరంలో ఉంది.. 50 నిమిషాల్లోనే చేరుకోవచ్చు. అయితే నంద్యాల జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే 90 కిలోమీటర్లు ప్రయాణించి గంట నుంచి గంటన్నర సమయం పడుతుంది.డోన్ ప్రాంత ప్రజలు వైద్య అవసరాల కోసం, ఉపాధి అవకాశాల కోసం కర్నూలు దగ్గరగా ఉండటంతో అక్కడికే వెళ్లడం సౌకర్యంగా ఉందంటున్నారు. నంద్యాలకు కేవలం జిల్లా అధికారులతో పనులుంటేనే వెళు ్తన్నారట. ప్యాపిలి మండల ప్రజలు కూడా తమ ప్రాంతాన్ని కర్నూలు

జిల్లాలోనే ఉంచితే బాగుంటుందని అభిప్రాయపడుతున్నారు. డోన్, ప్యాపిలి ప్రాంతాల ప్రజల్లో 95 శాతం మందికి పైగా తమ ప్రాంతాలను కర్నూలు జిల్లాలోనే కొనసాగించాలని కోరుతున్నారు.డోన్ ప్రజలు కోరుకున్నట్లుగానే కర్నూలు జిల్లాలో విలీనం చేసేందుకు ప్రయత్నిస్తున్నామని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి తెలిపారు. 2024 ఎన్నికల సమయంలో కూడా హామీ ఇచ్చామని.. ఇప్పటికే జిల్లాల పునర్విభజనపై నియమించిన మంత్రివర్గ ఉపసంఘం, ముఖ్యమంత్రికి సైతం లేఖను అందజేశామని చెప్పారు. ఈ ఏడాది డిసెంబర్ లోపు ఈ జిల్లాల పునర్విభజన ప్రక్రియ పూర్తి చేయాలని భావిస్తున్నారు. మరి డోన్‌వాసుల రిక్వెస్ట్‌ను పరిగణలోకి తీసుకుంటారలో లేదో చూడాలి. మరి డోన్ ప్రజల రిక్వెస్ట్‌పై ప్రభుత్వం, కేబినెట్ సబ్ కమిటీ ఎలా స్పందిస్తుందో చూడాలి. ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని డోన్‌వాసులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# కర్నూలు బస్సు ప్రమాదంలో మూడో వాహనం ప్రమేయం

**కర్నూలు అక్టోబరు 31, పెన్ పవర్:**
కర్నూలు జిల్లా చిన్నటేకూరు వద్ద జరిగిన స్లీపర్ బస్సు ప్రమాదంలో రోజుకో కొత్త కోణం వెలుగులోకి వస్తోంది. మొదట బస్సు వేగంగా వచ్చి బైక్ ని ఢీకొనడం వల్ల ప్రమాదం జరిగిందని అనుకున్నారు. ఆ తర్వాత కింద పడిపోయిన బైక్ ని బస్సు ఢీకొని ఈడ్చుకుంటూ వెళ్లడం వల్ల ప్రమాదం జరిగిందని నిర్ధారించుకున్నారు. ఇప్పుడు ఆ గ్యాప్ లో ఏం జరిగిందనే విషయాలు హైలైట్ అవుతున్నాయి. బైక్ కింద పడిన తర్వాత స్లీపర్ బస్సు ఆ బైక్ ని ఢీకొనే ముందు 14 వాహనాలు అదే రూట్ లో బైక్ ని దాటుకుని వెళ్లాయని పోలీసులు గుర్తించారు. ఈ 14 వాహనాల్లో ఓ బస్సు కూడా ఉంది. ఆ బస్సు బైక్ ని ఢీకొంది కానీ ప్రమాదం ఏమీ జరగలేదు. ఆ బస్సు ఢీకొనడం వల్ల బైక్ కాస్త పక్కకు జరిగింది. అది కూడా డివైడర్ నుంచి జరిగి రోడ్డు మధ్యలోకి వచ్చింది. ఆ తర్వాత స్లీపర్ బస్సు ఢీకొని దాన్ని ఈడ్చుకుని వెళ్లడం వల్ల ఘోరం జరిగిపోయింది. 19మంది సజీవ దహనం అయ్యారు. అదే జరగకపోయి ఉంటే..? కర్నూలు బస్సు ప్రమాదం జరిగిన తర్వాత అలా జరగకపోయి ఉంటే అనే కోణంలో చాలా ప్రశ్నలు, సమాధానాలు వినపడుతున్నాయి. అసలు ఆ బైక్ యాక్సిడెంట్ జరిగి డ్రైవర్ చనిపోకపోయి ఉంటే ఆ రోజు రాత్రి ఆ బైక్ అక్కడ పడి ఉండేది కాదు, అదే లేకపోతే స్లీపర్ బస్సు యధావిధిగా సాఫీగా వెళ్లిపోయేది. సో ప్రమాదం జరిగే ఛాన్సే లేదు. పోనీ బైక్ డివైడర్ ని ఢీకొని పడిపోయింది, డ్రైవర్ శివశంకర్ చనిపోయాడు. అతని స్నేహితుడు శశివశంకర్ శవాన్ని పక్కకు లాగేశాడు కానీ బైక్ ని పక్కకు తీయలేకపోయాడు. ఈలోగా వరుసగా వాహనాలు రావడంతో అతను భయపడి పారిపోయాడని తెలుస్తోంది. ఒకవేళ అతడు బైక్ ని కూడా పక్కకు లాగగలిగి ఉంటే ఈ ప్రమాదం జరిగి ఉండేది కాదు. అది కూడా తీసేద్దాం. స్లీపర్ బస్సు, బైక్ ని ఢీకొని లాక్కెళ్లే లోపల 14 వాహనాలు అటుగా వెళ్లాయి. అందులో ఏ ఒక్క వాహనం ఆగి చూసినా ఆ బైక్ ని ఎవరో ఒకరు పక్కకు తీసేవారు. అప్పుడు కూడా ఈ ప్రమాదం జరిగి ఉండేది కాదు. ఇక చివరిగా ఆ బైక్ ని ఢీకొన్న మరో బస్సు ఈ ప్రమాదానికి అసలు కారణంగా తెలుస్తోంది. ఆ బస్సు ఢీకొనడం వల్లే బైక్ డివైడర్ పక్కనుంచి కాస్త జరిగి రోడ్డు మధ్యలోకి వచ్చింది. దీంతో స్లీపర్ బస్సు దాన్ని ఢీకొని ఘోర ప్రమాదానికి కారణం అయింది. 19మంది ప్రయాణికులు సజీవ దహనం అయ్యారు. ఆ మూడో వాహనం.. స్లీపర్ బస్సు ఢీకొనడానికి ముందు ఆ బైక్ ని ఢీకొన్న వాహనం ఇప్పుడు హైలైట్ అవుతోంది. అది ఒక ఓమ్ని బస్సు. ఆ బస్సు నడిపిన డ్రైవర్ గురించి పోలీసులు ఆరా తీస్తున్నారు. బైక్ రోడ్డుకి అడ్డుగా పడి ఉంది, దాన్ని తన బస్సు తాకింది అని తెలిసిన వెంటనే కనీసం ఆ డ్రైవర్ పక్కన బస్సు

ఆపి దాని వద్దకు వెళ్లి ఉండాలి, లేదా వెనక వచ్చే వాహనాలను అప్రమత్తం చేసి ఉండాలి. అవేవీ జరగకపోవడం వల్ల ఈ ఘోరం జరిగిపోయింది. అంటే ఇక్కడ 19మంది ప్రయాణికులు చనిపోవడానికి కారణాలు అనేకం. ఇక్కడ నిర్లక్ష్యం ఒక్కరిదే అని చెప్పడానికి లేదు. అందరి నిర్లక్ష్యం కలగలిసి ఆ ప్రమాదానికి కారణం అయింది. చిట్టచివరిగా స్లీపర్ బస్సు డ్రైవర్ మంటలు చూసి పారిపోయాడే కానీ, ప్రయాణికుల్ని హెచ్చరించలేదు. అదే జరిగి ఉంటే కనీసం మరణాల సంఖ్య బాగా తగ్గి ఉండేది. అదృష్టం బాగుంటే అందరూ ప్రాణాలతో బయటపడేవారు. కానీ బస్సు డ్రైవర్ ఆ పని చేయలేదు. మంటలు చెలరేగగానే బస్సుని ఆపేసి భయంతో పరుగులు తీశాడు. కనీసం ఏ ఒక్కర్నీ అలర్ట్ చేయలేదని తెలుస్తోంది. ఇలా అందరి నిర్లక్ష్యం ఆ బస్సుని మంటల్లోకి నెట్టేసింది. 19మంది ప్రయాణికులు సజీవ దహణం కావడానికి కారణం అయింది

## వారితోనే అసలైన అగ్ని పరీక్ష: ఫైనల్లో సౌతాఫ్రికాతో ఢీ.. ఇండియాను భయపెడుతున్న ఇద్దరు సఫారీ ప్లేయర్స్!



**హైదరాబాద్ పెన్ పవర్:** మహిళల వరల్డ్ కప్ ఫైనల్లో ఇండియా, సౌతాఫ్రికా తలపడనున్నాయి. ఇప్పటివరకు ఒకసారి కూడా టైటిల్ గెలవని రెండు జట్లు తొలి టైటిల్ కోసం ఆరాటపడుతున్నాయి. ఇండియా ఇప్పటివరకు రెండుసార్లు ఫైనల్ కు వచ్చి ఓడిపోతే.. సౌతాఫ్రికా తొలిసారి వరల్డ్ కప్ ఫైనల్ కు చేరుకుంది. ఈ రెండు జట్లు తుది సమరానికి చేరుకోవడంతో మ్యాచ్ పై భారీ అంచనాలు నెలకొన్నాయి. రెండు జట్లు బలంగా ఉండడంతో విజేతను అంచనా వేయడం కష్టంగా మారుతుంది. ఆదివారం (నవంబర్ 2) ముంబైలోని డాక్టర్ డివై పాటిల్ స్పోర్ట్స్ అకాడమీలో ఫైనల్ జరగనుంది. సౌతాఫ్రికా జట్టులో ఇద్దరు మ్యాచ్ విన్నర్లను ఆపకపోతే ఇండియా ఫైనల్లో గెలవడం కష్టం. వారిలో ఒకరు కెప్టెన్ లారా వోల్వార్ట్ కాగా మరొకరు ఆల్ రౌండర్ మారిజాన్ కాప్. వోల్వార్ట్ ఇంగ్లాండ్ పై జరిగిన సెమీ ఫైనల్లో భారీ సెంచరీతో విరుచుకుపడింది. బుధవారం (అక్టోబర్ 29) గౌహతి వేదికగా బర్సపారా క్రికెట్ స్టేడియంలో జరిగిన ఈ సెమీస్ పోరులో వోల్వార్ట్ నెక్ట్స్ లెవల్ ఇన్నింగ్స్ ఆడుతూ 169 పరుగులు చేసి మారథాన్ ఇన్నింగ్స్ ఆడింది. ఒక్కసారి క్రీజ్ లో కుదురుకుంటే ఈ సఫారీ కెప్టెన్ ను ఆపడం కష్టం. ఫైనల్లో టీమిండియా వోల్వార్ట్ ను ఆపకపోతే విజయం కష్టమవుతోంది.

**మారిజాన్ కాప్ ఆల్ రౌండ్ షో :**

సౌతాఫ్రికా ఆల్ రౌండర్ మారిజాన్ కాప్ సూపర్ ప్రస్తుతం సూపర్ ఫామ్ లో ఉంది. అటు కొత్త బంతితో బౌలింగ్ చేసే కప్.. మిడిల్ ఓవర్స్ లో కీలక ఇన్నింగ్స్ ఆడుతూ జట్టును నిలబెడుతుంది. నిలకడగా ఆడుతూ తన అనుభవాన్ని చూపిస్తుంది. ఈ టోర్నీలో టాప్ ఫామ్ లో ఉన్న కప్ టీమిండియాకు అగ్ని పరీక్షగా మారనుంది. బ్యాటింగ్ లో నిలబడితే భారీ ఇన్నింగ్స్ లు ఆడగలదు. బౌలింగ్ లో తన స్వింగ్ తో వణికించగలదు. సెమీస్ లో కప్ అద్భుత ప్రదర్శన చేసింది. మొదట బ్యాటింగ్ లో 42 పరుగులు చేసిన ఈ సఫారీ ఆల్ రౌండర్.. ఆ తర్వాత బౌలింగ్ లో ఏకంగా 5 వికెట్లు పడగొట్టి మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శన చేసింది.

## ఇండియా వరల్డ్ కప్ గెలిస్తే.. జెమీమాతో కలిసి పాట పాడతా: సునీల్ గవాస్కర్





**హైదరాబాద్ పెన్ పవర్:** స్వదేశంలో జరుగుతోన్న ఉమెన్స్ వరల్డ్ కప్?లో అతిథ్య ఇండియా ఫైనల్?కు దూసుకెళ్లింది. సెమీస్?లో డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియాను 5 వికెట్ల తేడాతో చిత్తు చేసి సగర్వంగా భారత్ ఫైనల్?కు చేరుకుంది. ఇండియా ఫైనల్?కు వెళ్లిందంటే కారణం జెమీమా రోడ్రిగ్స్. ఇందులో ఎలాంటి సందేహం అక్కర్లేదు. కళ్లముందు కొండంత లక్ష్యం.. మరోవైపు ఓపెనర్లు త్వరగా ఔట్ అయ్యారు.. ఈ దశలో క్రీజులోకి వచ్చిన జెమీమా అసాధారణ పోరాట పటిమ కనబర్చింది. మహిళల క్రికెట్లోనే బలమైన బౌలింగ్ లైనప్ కలిగిన ఆస్ట్రేలియాపై చివరి వరకు క్రీజులో నిలబడి వీరోచిత సెంచరీ చేసింది. జెమీమా చిరస్మరణీయ ఇన్సింగ్స్?తో ఇండియా ఫైనల్? పోరుకు దూసుకెళ్లింది. ఓపిక లేకున్నా జట్టు విజయం కోసం శరీరంలోని బలాన్నంతా కూడగట్టుకుని చివరి వరకు క్రీజులో నిలబడి ఇండియాకు అపూర్వ విజయం అందించిన జెమీమాపై ప్రశంసల వర్షం కురుస్తోంది. ఈ క్రమంలోనే టీమిండిమా మాజీ దిగ్గజం సునీల్ గవాస్కర్ జెమీమాపై పొగడ్తలు కురిపించారు. ఆస్ట్రేలియా వంటి బలమైన ప్రత్యర్థిపై జెమీమా ఇన్సింగ్స్ అద్భుతమని కొనియాడారు. తీవ్ర ఒత్తిడిలో జెమీమా చూపించిన పోరాటం అసాధారణమని ప్రశంసించారు. ఈ సందర్భంగా సునీల్ గవాస్కర్ ఒక వాగ్దానం చేశారు. ఉమెన్స్ వరల్డ్ కప్ టైటిల్ ఇండియా గెలిస్తే.. జెమీమా రోడ్రిగ్స్?తో కలిసి ఒక పాట పాడుతానని చెప్పారు. ఆమె గిటార్ వాయిస్తుంటే తాను పాట పాడుతానని అన్నారు. జెమీమాకు ఇష్టం ఉంటనే ఈ పని చేస్తానన్నారు. గతంలో ఓసారి బీసీసీఐ అవార్డుల కార్యక్రమం సందర్భంగా తాము ఇలా చేశామని గవాస్కర్ గుర్తు చేశారు. జెమీమా గిటార్ వాయిస్తుంటే.. తాను పాడానని వివరించారు. టీమిండియా వరల్డ్ కప్ గెలిస్తే.. మరోసారి ఆ సీన్ రిపీట్ చేయాలనుకుంటున్నానని గవాస్కర్ అభిప్రాయం వ్యక్తం చేశారు.

## ఆస్ట్రేలియాను చేజేతులా ఓడించిన కెప్టెన్.. ఇండియాకు వచ్చిన స్టార్క్‌కు చేదు జ్ఞాపకం



**హైదరాబాద్ పెన్ పవర్:** వరల్డ్ కప్ ఫైనల్లో ఆస్ట్రేలియా అద్భుతంగా ఆడినప్పటికీ టీమిండియాపై ఓటమి తప్పలేదు. మొదటి బ్యాటింగ్ చేసి 338 పరుగుల భారీ స్కోర్ చేసి భారత జట్టుకు ఛాలెంజ్ విసిరింది. ఆ తర్వాత ఓపెనర్లను త్వరగా ఔట్ చేసి మ్యాచ్ పై పట్టు బిగించారు. ఇక ఆసీస్ విజయానికి తిరుగు లేదనుకుంటున్న సమయంలో టీమిండియా ప్లేయర్స్ జెమీమా రోడ్రిగ్స్, హర్మన్ ప్రీత్ కౌర్ భారీ భాగస్వామ్యంతో జట్టును నిలబెట్టారు. కౌర్, జెమీమా మూడో వికెట్ కు 167 పరుగుల భాగస్వామ్యాన్ని నిర్మించి విజయానికి బాటలు వేశారు. వీరిద్దరి భాగస్వామ్యంతో ఆస్ట్రేలియా వెనకడుగు వేసింది. వాస్తవానికి ఈ మ్యాచ్ లో ఆస్ట్రేలియా వచ్చిన అవకాశాలను జారవిడిచింది. ముఖ్యంగా ఆసీస్ కెప్టెన్ అలిస్సా హీలీ జట్టు ఓటమికి కారణమైంది. అందివచ్చిన రెండు ఈజీ ఛాన్స్ లను జారవిడిచింది. మొదట హర్మన్ ప్రీత్ కౌర్ ఈజీ స్టంపింగ్ ను మిస్ చేసిన హీలే.. ఆ తర్వాత జెమీమా ఇచ్చిన సులువైన క్యాచ్ ను జారవిడిచింది. ఆ సమయానికి రోడ్రిగ్స్ 82 పరుగులు వద్ద బ్యాటింగ్ చేస్తుంది. ఇండియా స్కోర్ 206. ఈ సమయంలో జెమీమా ఔటై ఉంటే మ్యాచ్ లో ఆస్ట్రేలియా పట్టు సాధించేది. హీలే తన చెత్త ఫీల్డింగ్ తో పాటు కెప్టెన్సీలోనూ విఫలమైంది. అంతేకాదు బ్యాటింగ్ లోనూ 15 బంతుల్లో 5 పరుగులే చేసి విఫలమైంది.ఇలా అన్ని విభాగాల్లో ఈ ఆసీస్ సారధి విఫలమై జట్టు విజయానికి కారణమైంది. హీలే కోసం ఇండియాకు వచ్చిన మిచెల్ స్టార్క్ తన భార్య ప్రదర్శనతో తీవ్ర నిరాశకు గురయ్యాడు. ఆస్ట్రేలియా నుంచి మ్యాచ్ చేజారుతున్న సమయంలో విచారం వ్యక్తం చేశాడు. హీలే ఎక్కడ మ్యాచ్ ఆడిన స్టార్క్ చూడడానికి వెళ్తాడు. తన భార్య కోసం ఆస్ట్రేలియా నుంచి ఇండియాకు వెళ్లిన స్టార్క్ కు ఈ మ్యాచ్ చేదు జ్ఞాపకంగా మిగిలింది. ఇదిలా ఉంటే ఈ వరల్డ్ కప్ తనకు చివరి టోర్నీ అని ఆస్ట్రేలియా కెప్టెన్ కన్ఫర్మ్ చేసింది. లీగ్ దశలో వరుస సెంచరీలతో హోరెత్తించిన హీలే.. నాకౌట్ లో మాత్రం ఒత్తిడిలో చేతులెత్తేసింది.ఈ మ్యాచ్ విషయానికి వస్తే.. మహిళల వరల్డ్ కప్ లో టీమిండియా అద్భుతం చేసింది. ఆస్ట్రేలియా విధించిన 339 పరుగుల అసాధారణ లక్ష్యాన్ని ఛేజ్ చేసి ఫైనల్ కు దూసుకెళ్లింది. గురువారం (అక్టోబర్ 30) నవీ ముంబై వేదికగా డాక్టర్ డివై పాటిల్ స్పోర్ట్స్ అకాడమీలో ముగిసిన మ్యాచ్ లో 5 వికెట్ల తేడాతో థ్రిల్లింగ్ విక్టరీ కొట్టింది. జెమీమా రోడ్రిగ్స్ (127) వీరోచిత సెంచరీతో చివరి వరకు క్రీజ్ లో ఉండి టీమిండియాకు విజయాన్ని అందించింది. కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ 89 పరుగులు చేసి కీలక ఇన్నింగ్స్ ఆడింది. మొదట బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 48.3 ఓవర్లలో 338 పరుగులకు ఆలౌటైంది. లక్ష్య ఛేదనలో ఇండియా 48.3 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 341 పరుగులు చేసి గెలిచింది.

ఎర్ర చీరలో నువేక్ష అతిలోక సుందరి



## చియాన్ విక్రమ్.. మరో రిస్క్ తీసుకుంటున్నాడా?

అపరిచితుడు, శివపుత్రుడు.. ఈ పేర్లు వినగానే తెలుగు ఆడియెన్స్‌కు గుర్తొచ్చేది చియాన్ విక్రమ్. క్యారెక్టర్ కోసం ప్రాణం పెట్టే నటుల్లో ఆయన ఫస్ట్ ప్లేస్ లో ఉంటారు. ఆ డెడికేషన్, ఆ మేకోవర్స్ ఇండియాలోనే చాలా తక్కువ మంది హీరోలు చేస్తూంటారు. అందుకే, విక్రమ్ సినిమా వస్తుందంటే, అది రొటీన్‌గా ఉండదని, ఏదో ఒక కొత్త పాయింట్‌తో వస్తుందని జనాలు నమ్ముతారు.కానీ, ఆ నమ్మకాన్ని నిలబెట్టే రేంజ్ సక్సెస్ విక్రమ్ చూసి చాలా కాలమైంది. ముఖ్యంగా అపరిచితుడు తర్వాత, తెలుగులో ఆ సినిమా క్రియేట్ చేసిన ఇంపాక్ట్‌ను మళ్లీ రీ క్రియేట్ చేయలేకపోయారు. మధ్యలో ఐ, కోబ్రా, మహాన్ లాంటి ఎన్నో ప్రయత్నాలు చేసినా, ఆ ల్యాండ్‌మార్క్ హిట్ మాత్రం పడలేదు. పొన్నియిన్ సెల్వన్ పెద్ద హిట్ అయినా, అది మణిరత్నం మార్క్ మల్టీ స్టారర్ గా నిలిచింది. సోలోగా విక్రమ్ విశ్వరూపం చూసి చాలా ఏళ్లయింది. ఈ మధ్య తంగలాన్, వీర ధీర శూరన్ లాంటి సినిమాలతో ఫ్యాన్స్‌ను పలకరించినా అవేమి బాక్సాఫీస్ వద్ద పెద్దగా మ్యాజిక్ చేసింది లేదు. ఇక ఆడియెన్స్ అతని నుంచి కోరుకుంటున్న ల్యాండ్ మార్క్ సినిమా అయితే ఇంతవరకు సెట్ కాలేదు. సాధారణంగా ఇలాంటి టైమ్‌లో, ఒక స్టార్ హీరో సాలిడ్ కమ్‌బ్యాక్ ఇవ్వాలంటే, పేరున్న పెద్ద డైరెక్టర్‌తో, ఒక సేఫ్ ప్రాజెక్ట్‌తో వస్తాడు. కానీ, విక్రమ్ అలా ఆలోచించడం లేదు. ఆశ్చర్యకరంగా, చియాన్ 63 కోసం విక్రమ్ ఒక కొత్త డైరెక్టర్‌ను నమ్ముకున్నాడు.చాలా కాలం తర్వాత, విక్రమ్ ఒక డెబ్యూ డైరెక్టర్‌తో సినిమా చేస్తుండటం ఇప్పుడు కోలీవుడ్‌లో హాట్ టాపిక్. ఇంత పెద్ద రిస్క్ ఎందుకు తీసుకుంటున్నాడు? అంటే, ఒకే ఒక్క సమాధానం వినిపిస్తోంది.. ఆ కొత్త డైరెక్టర్ చెప్పిన స్క్రిప్ట్ విక్రమ్‌కు అంత బాగా నచ్చిందట. ఈ ఒక్క మూవ్ చాలు విక్రమ్ మెంటాలిటీ అర్థం చేసుకోవడానికి. ఆయనకు కావాల్సింది సక్సెస్ ఫుల్ డైరెక్టర్ కాదు, ఒక సాలిడ్ స్క్రిప్ట్. ఆయనకు కావాల్సింది సేఫ్ గేమ్ కాదు, నటుడిగా ఛాలెంజ్ చేసే ఒక కొత్త రోల్.

శివపుత్రుడు టైమ్‌లో ఆయన ఆకలి ఎలా ఉండేదో, ఇన్నేళ్ల తర్వాత, ఇన్ని ఫ్లాపుల తర్వాత కూడా ఆయన ఆకలి తగ్గలేదని అర్థమవుతుంది. ఈ రిస్క్ వర్కవుట్ అవ్వొచ్చు, అవ్వకపోవచ్చు. కానీ, విక్రమ్ మాత్రం తనను తాను కొత్తగా ఆవిష్కరించుకోవడం ఆపడం లేదు. ఆ డెబ్యూ డైరెక్టర్ కనుక ఆ స్క్రిప్ట్‌ను పర్ఫెక్ట్‌గా డీల్ చేస్తే, తెలుగు ఆడియెన్స్ ఎప్పటినుంచో మిస్ అవుతున్న ఆ పాత అపరిచితుడుని మళ్లీ చూడొచ్చు.

హెబ్బా పటేల్ స్టైల్ అన్ని హైప్‌లకు విలువైనది





Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at Nagendla venkateswarlu, Door no:7-1-107, station road, Narasaraopet, Palnadu District Andhrapradesh- 522601 Editor : GANTYADA APPARAO Mobile : 9059465965, RNI : APTEL/25/A2292, editorpenpower@gmail.com